జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

MAM (మెంబర్‌షిప్ అడ్వకేట్స్ మీడియా)
సహకారంతో బహుజన
రాజ్యాధికారం సాధిద్దాం

శివ భాగ్య రావు బహుజన IRS-VRS
నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి

సంపుటి 15 సంచిక 84 విశాఖపట్నం గురువారం 01 డిసెంబరు 2022 8 పేజీలు వెల : 5.00

# జనంతోనే మా పొత్తు..

## మాకు ఎవరితోనూ పొత్తులు ఉండవు.. పొత్తులపై సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు..



మదనపల్లె, ప్రజాపాలన ప్రతినిధి: పొత్తులపై ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఎవరితోనూ పొత్తులు ఉండవని తేల్చి చెప్పారు. మదనపల్లెలో బటన్ నొక్కి.. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 694 కోట్ల రూపాయలు జమచేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ.. తామకు కేవలం జనంతోనే పొత్తు ఉంటుందని తేల్చి చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబులా తాను దుష్టచతుష్టయాన్ని నమ్ముకోలేదని.. ప్రజల్నే నమ్ముకున్నానని స్పష్టత ఇచ్చారు. తాను ఏం చెబుతానో, అదే చేసి చూపిస్తానన్నారు. ప్రస్తుతం రాక్షసులతో, మారీచులతో యుద్ధం చేస్తున్నామన్నారు విమర్శించారు సీఎం జగన్. విపక్షాల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అక్షరాలు రాయడం, చదవడం మాత్రమే విద్యకు పరమార్థం కాదు. తనకు తానుగా ప్రతి పాప, ప్రతిబాబు ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తిని ఇవ్వగలుగడమే విద్యకు పరమార్థమని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐనిస్టిన్ చక్కగా చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు శుభవార్తను అందించారు. మదనపల్లెలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 694 కోట్ల రూపాయలు జమచేశారు. దీంతో మొత్తం 11.02 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. మొత్తం మీద ఇప్పటి వరకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద 12,401 కోట్లు విడుదల చేశారు. కానీ ఈ రోజు రాజకీయ విషయాల్లోకి వస్తే ఈ రోజు కొరబడిన అలాంటి ఆలోచన శక్తి, కొరవడిన వివేకం ప్రతిపక్షాలకు ఎప్పటికైనా రావాలి. పేదల పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదవకూడదని కోరుకుంటున్న ప్రతిపక్షాల వైఖరి మారాలని ఆ దేవుడిని కోరుకుంటున్నా అన్నారు.

# పూలే, అంబేద్కర్‌లకు నిజమైన నివాళి..

# బహుజన రాజ్యాధికారం సాధించడమే

## అంబేడ్కర్ టివి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జెబి రాజు



గుంటూరు (ప్రజాపాలన ప్రతినిధి ): 85 శాతం గా ఉన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బీసీలు, ఎస్సీ, ఎస్టీ లు రాజ్యాధికారం సాధించిన నాడే పూలే, అంబేడ్కర్ కలలు సాకారం అయినట్లు అని అంబేడ్కర్ టివి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జెబి రాజు పేర్కొన్నారు. బుదవారం రోజు గుంటూరు లోని ఏసి కాలేజ్ ఆఫ్ లా కాన్ఫరెన్స్ హల్ లో జరిగిన రాష్ట్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్బంగా జెబి రాజు మాట్లాడుతూ నేడు మనమందరం ఎమ్మెల్యే, ఎంఎల్, ఐఎఎస్,ఐపిసి పదవులు పొందుతున్నామంటే బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన పోరాట ఫలితమే అన్నారు..కానీ నేడు దానికి భిన్నంగా వ్యవస్థ లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. గాంధీ కంటే మహాత్ముడు ముందు ఉన్నాడంటే మహాత్మా జ్యోతరావు పూలే ఒక్కడే అని అన్నారు. కొన్ని వేల సంత్సరాలపాటు చదువు లేదు..చదువు అనే వెలుగు ను చూపించిన మొదటి వ్యక్తి పూలే మహానుభావుడే అన్నారు. ఇలాంటి పరిస్థతుల నేపథ్యం లో పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను జై భీం అనే పేరు తో స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వం ను సాధించాల్సిన కర్తవ్యం మన ముందు ఉంది. ఈ దేశంలో సామాజిక,రాజకీయ,ఆర్ధిక అసమానతల తొలగి, న్యాయం జరగాలంటే ఉద్యమం చేయాల్సిందే అని ఉద్ఘాటించారు. 74 స్వతంత్ర భారత దేశంలో సమ న్యాయం యెక్కడ ఉంది అని ప్రశ్నించారు. అంబేద్కర్ మన రాజ్యాంగం లో ఏమి రాశాడో..బహుజనులు అధికారం లోకి వచ్చినపుడు మాత్రమే పూలే, అంబెడ్కర్ కన్న కలలు సాధ్యమవుతుందని తెలిపారు. (మిగతా 2లో..)



# చివరి అవకాశం ప్రజలకే..

## టీడీపీ అధినేత చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు..



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: "చివరి అవకాశం నాకు కాదు.. ప్రజలకు.. ఇప్పుడైనా ప్రజలంతా కళ్లు తెరవాలి.. మరోసారి ఉన్మాదులు గెలిస్తే అమరావతి, పోలవరం ఉండదు.. నాకేం కొత్త చరిత్ర అవసరం లేదు.. ప్రజల మంచి కోసమే చెబుతున్నా".. అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఏపీలో సీఎంగా చేశానని.. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానన్నారు. తనకు ఎమ్మెల్యే పదవితో పనిలేదని.. రాష్ట్ర ప్రజల్లో చైతన్యం రావాలని, అందుకు అంతా ధైర్యంగా ముందుకు రావాలని పేర్కొన్నారు. భయపడితే ఆ భయమే మనల్ని చంపేస్తుందంటూ చంద్రబాబు తెలిపారు. . ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం విజయరాయిలో.. ఇదేం ఖర్మ పేరుతో చంద్రబాబు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం దిగిపోతేనే ఏపీ రాష్ట్రం బాగుపడుతుందని పేర్కొన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్.. ప్రజల నెత్తి మీద భస్మాసుర హస్తం పెట్టారని విమర్శించారు. రాష్ట్రం అన్ని రకాలుగా దెబ్బతిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడ చూసినా జనం ఇదేం ఖర్మ అనే పరిస్థితికి వచ్చిందన్నారు. ఆనాడు తాను చెప్పిందే.. ఇవాళ జరుగుతోందని.. రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఇప్పుడైనా తన మాట వింటారని ఆశిస్తున్నారని.. ఇప్పుడు కూడా వినకపోతే ఈ రాష్ట్రానికి ఇదే ఆఖరి అవకాశం అవుతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా అర్జున అవార్డుల ప్రదానం




ఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో బుధవారం అర్జున అవార్డుల కార్యక్రమం ఘనంగా జరిగింది. 25 మంది క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అర్జున అవార్డులను ప్రదానం చేశారు. అలాగే ఏడుగురు కోచ్‌లను ద్రోణాచార్య అవార్డు, నలుగురు ఆటగాళ్లను ధ్యాన్‌చంద్ అవార్డుతో సత్కరించారు. స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్‌లను రాష్ట్రపతి సత్కరించారు. వీరిద్దరూ ఈ ఏడాది థామస్ కప్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టులో సభ్యులు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ సారి అర్జున అవార్డులకు ఎంపికైన క్రీడాకారుల్లో ఎక్కువగా కామన్వెల్త్ గ్రేమ్స్-2022లో పాల్గొని భారత్‌కు పతకాలు అందించారు. లక్ష్యసేన్‌తో పాటు మహిళా బాక్సర్ నిఖత్ జరీన్, రెజ్లర్ అన్షు మాలిక్‌తో పాటు భారత గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజానందను అర్జున అవార్డుతో రాష్ట్రపతి సత్కరించారు.



## ఏపీలో పవన్ ఎక్కడ పోటీచేసినా.. ఓడిపోతాడు.. మంత్రి జోగి రమేష్

అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఎక్కడి నుంచి పోటీ చేసినా ఓడిపోతాడని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ%౫% రాష్ట్రంలోని 175 స్థానాలు గెలవడమే తమ లక్ష్యమన్నారు. వైసీపీ కంచుకోటను ఇంచుకూడా కదిలించలేరన్నారు. ప్రతిపక్షాలు వైసీపీని కూల్చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తుకి సహకరిస్తాం..

### వచ్చే ఎన్నికల్లో 175సీట్లు గెలుస్తాం.. మంత్రి ఆదిమూలపు సురేష్



అమరావతి: 2019 ఎన్నికల్లో ఒక్క చోట కూడా పవన్ కళ్యాణ్ గెలవలేకపోయాడని ఏద్దేవా చేశారు మంత్రి ఆదిమూలపు సురేష్. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తుకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని తెలిపారు మంత్రి ఆదిమూలపు సురేష్. పొరుగు రాష్ట్ర రాజకీయాలతో మాకు సంబంధం లేదన్నారు మంత్రి . కానీ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాసే కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నా వేం విమర్శిస్తామన్నారు. రాజ్యాంగ బద్దంగా పరిపాలన జరుగుతుంది కాబట్టి దానికి వ్యతిరేకంగా ఎక్కడ జరిగినా అది కరెక్ట్ కాదన్నారు. బాధితులకు మా సానుభూతి ఉంటుందన్నారు. ఇక వివేకానందరెడ్డి మా నాయకుడని.. ఆయన హత్య కేసులో దోషులు ఎవరో తేల్చాల్సిందేనన్నారు. ఒకే ప్రాంతంలో రాజధాని నిర్మాణం కరెక్ట్ కాదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను శిరసావహించాల్సిన బాధ్యత ఉందన్నారు మంత్రి ఆదిమూలపు. జనసేన పార్టీ భావజాలం ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలియాలన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోయడమే అజెండా అనడం విడ్డూరంగా ఉందన్నారు.

## మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లో పోలీసు బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఇవాళ మధ్యాహ్నం మాండ్లా, బాలాఘాట్ జిల్లాల సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మాండ్లా, బాలాఘాట్ జిల్లాలకు చెందిన సంయుక్త పోలీసు బలగాలు మావోయిస్టులకు కోసం ఈ ఉదయం కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. ఈ సందర్భంగా బాలాఘాట్ జిల్లాలోని గర్హి ఏరియా, మాండ్లా జిల్లాలోని మోటినాలాకు చెందిన సుప్‌ఖార్ ఏరియాల మధ్య ఒకరికొకరు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం

వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

## పూలే, అంబేద్కర్‌లకు నిజమైన నివాళి..

# బహుజన రాజ్యాధికారం సాధించడమే






(మొదటిపేజీ తరువాయి)

**పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు మాట్లాడుతూ**

ఈ దేశంలో కులాల వారీగా జనాభా ప్రాతిపదికన వర్గీకరణ జరిగినప్పుడే సమన్యాయం జరుగుతుందని అందుకోసం పూలే అంబేద్కర్ రాజ్యాంగ సమితి ద్వారానే సాధ్యమవుతుందన్నారు,ఈ దేశంలో అత్యధిక జనాభా కలిగిన బిసి సామాజిక వర్గం ముఖ్యమంత్రి కావాలనే ఆలోచన అంబేద్కర్ చూచిన ద్వారా పార్స్ పనిచేస్తుందన్నారు. ఈ సమాజంలో జంతువులు వృక్షాలు సంక్రమణ ద్వారా వచ్చిన కొత్త జనరేషన్ కి పేర్లు పెట్టడం జరుగుతుందని. అదే మానవుల్లో కులాంతర వివాహాలు ద్వారా జన్మించిన కొత్త జనరేషన్ కి పేర్లు లేకపోవడం దురదృష్టకర మన్నారు. ఆ విధంగా నూతన జనరేషన్ కి అంబేద్కర్ ఫూలే రాజ్యాంగ సమితి సమతా కులంగా పేరు పెట్టి ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు.

**పార్స్ ఎపి ఇంచార్జి గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ**

బహుజన రాజ్యాధికారం ఒక్క పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తోనే సాధ్యమన్నారు. బహుజనులు రాజ్యాధికారం సాధించినప్పుడే పూలే, అంబేద్కర్ ల కలలు సాకారం అయినట్లన్నారు. ఈ దేశంలో కొన్ని కులాలు మాత్రమే పార్లమెంట్ అసెంబ్లీ మెట్లు ఎక్కుతున్నారని అత్యధిక జనాభా కలిగినటువంటి వర్గాలు ప్రజలు చట్టసభల్లో భాగస్వామ్యలు కావాలని ఈ దేశ బహుజనులకు పిలుపునిచ్చారు.

**పార్స్ స్టేట్ కోఆర్డినేటర్ నమ్మి అప్పారావు మాట్లాడుతూ**

బహుజనుల్లో రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం అందుకోసం పూలే అంబేద్కర్ రాజ్యాంగ సమితి ఆదిశగా పనిచేస్తుందని అన్నారు. విద్యా ఉపాధి చట్టసభల్లో సమన్యాయం కోసం మూడు విభాగాలు ఏర్పాటు చేసి పార్స్ పనిచేస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్స్ ఆంధ్రప్రదేశ్లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేస్తుందన్నారు

**పార్స్ స్టేట్ కోశాధికారి గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ**

పార్స్ ఆశయమైన యమ్.ఎ. యమ్..లోభాగంగా బహుజన రాజ్యాధికార సాధనలోఅందరం ముందుగా సభ్యత్వం తీసుకోవాలని తెలియచేసారు. విజయవాడ లో జరిగిన పార్స్ అడ్వైజరీ కమిటీ సభ్యులు సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ కమిటీ లో మనం నాయకులుగానియమింప బడిన వారందరూ ముందుగా పార్స్‌లో సభ్యత్వం పొందాలని తద్వారా మనం మనపార్స్ లో నాయకులుగా వుండి అనేక మందినాయకులను తయారు చేయుటకు అవకాశం వుంటుందని,కాబట్టి అందరూ మొదటి గాతప్పనిసరిగా పార్స్ లో సభ్యత్వం తీసుకోవాలనిపిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో పార్స్ జాతీయ అధ్యక్షులు. జె.బి.రాజు, జాతీయ కన్వీనర్. డాక్టర్ కటికల .శివభాగ్యారావు,రాష్ట్ర ఇంచార్జి గూడూరి.సీతామహాలక్ష్మీ,రాష్ట్ర కో ఆర్డినేటర్. నమ్మి.అప్పారావు.రాష్ట్ర ఉపాధ్యక్షులు. రత్నశ్రీ రాష్ట్ర కార్యదర్శి. పిల్లి.రాజు.రాష్ట్ర మీడియా ఇన్ చార్జ్. గురజాల శ్రీనివాసరావు,. పార్స్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకుడు మేకల.సుబ్బారావు,కార్మిక సంఘ నాయకులు ప్రకాశరావు,కాగితం, వరప్రసాద్‌సువార్తవాణి డైరక్టర్ పిల్లి.శ్యామ్ ప్రసాద్‌న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కాశిమాల. విజయకుమార్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దానాగౌడ్ రేపూడి.దోర్కావాణి,పూనూరి కృష్ణ కుమారి, పిడతల.రమాదేవి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన విద్యార్థులందరికి విద్యా దీవెన పథకం



బాపట్ల జిల్లా ప్రజాపాలన నవంబర్. 30. పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలుచేస్తుందని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు జగనన్న విద్యా దీవెన నాల్గవ త్రైమాసిక నిధుల పంపిణీ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆన్ లైన్ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమాన్ని తిలకించేలా అధికారులు స్థానిక డి.ఆర్.సి సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం జిల్లా కలెక్టరు విజయకృష్ణన్, శాసనసభ్యులు రఘుపతి చేతుల మీదుగా విద్యార్థులకు చెక్కు రూపంలో నగదు పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడానికి ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని శాసనసభ్యులు రఘుపతి చెప్పారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యాప్రాధాన్యతను దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్ రెడ్డి గుర్తించారని ఆయన చెప్పారు. విద్యార్థులు చదువులు తల్లిదండ్రులకు భారం గాకుండా బోధనరుసుములు పథకాన్ని విస్తృతం చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి అర్హులైన విద్యార్థులందరికి బోధన రుసుములు చెల్లిస్తున్నారని వివరించారు. విద్యార్థుల జీవితాలు మారిపోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నిబద్ధతతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. ఉన్నతమైన విలువలతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. గతంలో రావలసిన బోధన రుసుములను సైతం మంజూరు చేసిందన్నారు. నాడు– నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కగా చదువుకొనేలా పాఠశాలలను సుందరీకరణ చేసున్నట్లు వివరించారు. నేను కూడా మున్సిపల్ పాఠశాలలోనే చదివానని ఆయన గుర్తుచేసారు. జగనన్న విద్యా దీవెన కింద బాపట్ల నియోజకవర్గంలోని విద్యార్థులకు రూ.3 కోట్లు వచ్చాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నాల్గవ త్రైమాసిక నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. బాపట్లలో ఎస్.సి, ఎస్.టి, బి.సి, ఇ.బి.సి, ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీ, కాపు సామాజిక వర్గాలలోని 34 వేల 159 విద్యార్థులకు రూ.24.44 కోట్ల నగదును వారి తల్లుల ఖాతాలకు జమ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారిణి డి.కల్పన, వసతి గృహ సంక్షేమ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంచెలంచెలుగా..., రోటరీ అసిస్టెంట్ గవర్నర్ స్థాయికి.. ఎదిగిన సేవాకర్ణ దోగుపర్తి వెంకట సురేష్




చీరాల, నవంబర్ 30, ప్రజాపాలన : కనీ, వినీ,ఎరుగని రీతిలో రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, ఇన్నర్ వీల్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో, కాబోయే రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్ చేతుల మీదుగా, ప్రారంభించబడిన రోటరీ యువజనవారోత్సవాలకు, ప్రజల నుండి విశేష స్పందన లభించింది. రోటరీ సామాజిక భవనం నందు, చారిత్రాత్మకంగా ముగిసిన యువజన వారోత్సవాలను, కాబోయే అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్ ప్రారంభించగా, తొలిరోజు డ్రాయింగ్ పోటీలలో 100మంది విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, ఇన్నర్‌వీల్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో,రోటరీ సామాజిక భవనం నందు యువజన వారోత్సవాలు ఆట్ల ప్రోగ్రెసివ్ ఇన్వెస్ట్మెంట్ సర్వీసెస్ వారి ఆర్థిక సహకారంతో, డ్రాయింగ్, చెస్, సింగింగ్, వక్తృత్వ, ఫ్యాన్సీ డ్రెస్, క్విజ్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర పలు రకాల పోటీలను, రోటరీ సభ్యులు చాలా చక్కగా నిర్వహించారు. అంచెలంచెలుగా ఎదిగి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కాబోతున్న రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల మాజీ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, క్విజ్ మాస్టర్ గా నిర్వహించిన క్విజ్ పోటీలు ఆలో చింపచేసాయి. వైద్యవృత్తి లోను బిజీ, సామాజిక సేవా కార్యక్రమాలలోనూ, బిజీ బిజీ, అన్నట్లుగా, క్షణం తీరిక లేకుండా, డాక్టర్ బాబూరావు, సుభాషిణి దంపతులు, యువజన వారోత్సవాలను విజయవంతం చేసేందుకు చేసిన కృషి స్ఫూర్తిదాయకం. రోటరీ క్లబ్ కృష్ణార్జునులుగా పిలు చుకునే పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్ లు, వారోత్సవాలను విజయవంతం చేసేందుకు అంకితభావంతో చేసిన కృషి ప్రశంసనీయం. ప్రముఖ సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, ప్రతాప్ ఇండస్ట్రీస్ అధినేత మువ్వల వెంకటరమణారావు, గీతా ట్రస్ట్ చైర్మన్ వలివేటి మురళీకృష్ణ, సీనియర్ రోటరీ ప్రతినిధులు, ఆద్యంతం రోటరీ యువజన వారోత్సవాలను, విజయవంతం చేసేం దుకు, అంకితభావంతో పనిచేసి, కీలకంగా వ్యవహరించారు. గెలుపొందిన విజేతలకు, ముఖ్య అతిథిగా హాజరైన చీరాల డీఎస్పీ పి. శ్రీకాంత్ చేతుల మీదుగా, బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. యువజన వారోత్సవాలకు విశేష స్పందన, రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులుగా పనిచేసి, కాబోయే రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్ చేతుల మీదుగా, యువజన వారోత్సవాల ప్రారంభోత్సవం, యువజన వారోత్స వాలతో సమాంతరంగా, నోట్‌బుక్స్ పంపిణీ వంటి సామాజిక సేవాకార్యక్రమాలు, డిఎస్పీ పి.శ్రీకాంత్ చేతులమీదుగా బహుమతుల పంపిణీ తదితర కార్యక్రమాలనిర్వహణ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. సేవాకర్ణ గా అభిమానులు పిలుచుకునే దోగుపర్తి వెంకట సురేష్, 2022-23 అసిస్టెంట్ గవర్నర్ గా నియమించబడటం పట్ల రోటరీ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, సురేష్ కి ఘనసన్మానం చేశారు. సేవా గుణానికి మరో పేరు సురేష్ అని పలువురు రోటరీ ప్రముఖులు అభినందించడం విశేషం. ఆయా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు డా.ఐ. బాబూరావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుభాషిణి, నళిని, లలిత కుమారి, మాధవి, ఉషా, క్లబ్ అడ్మిని స్ట్రేషన్ డైరెక్టర్.పోలుదాసు. రామ కృష్ణ, వలివేటి మురళీకృష్ణ, గుర్రం రాఘవరావు, జి.వై.ప్రసాద్, సిహెచ్.కృష్ణమూర్తి, యం.వి. రామారావు, ఏ. నాగ వీరభద్రాచారి, బత్తుల బ్రహ్మారెడ్డి, డాక్టర్ యం.వి.రమణారావు, ఫణిదపు శివాంజనేయప్రసాద్, మధుసూదనరావు, ఏకాంబరేశ్వరబాబు, జి.ప్రభాకర్ విశ్వకర్మ, ప్రతాప్, తదితర రోటరీ, ఇన్నర్ వీల్ సభ్యులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా దీవెన-వసతి దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్



రాజోలు నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి.:విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చని రాజోలు నియోజకవర్గంఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మలికిపురంలో జగనన్న విద్యా దీవెన-వసతి దీవెన కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాకూడదని లక్ష్యంతో సీఎం జగన్మోహన్ రెడ్డి గారు విద్యా దీవెన-వసతి దీవెన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ ముఖ్య నాయకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ పదవులపై అధిష్టానం పునరాలోచించాలి...

**సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల విన్నపం**



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తెలుగుదేశం పార్టీలో కేవలం సత్తెనపల్లి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు నియామకాలను ఏకపక్షంగా ఎన్నుకోవడం సరికాదని వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు అధిష్టానానికి తమ ఆవేదన తెలియ చేశారు. ఇటీవల రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి విడుదలైన సత్తెనపల్లి నియోజకవర్గ మండల స్థాయి కమిటీల నియామకం గురించి సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాల లోని గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు యన్,టి,ఆర్ భవన్ లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల, నకరికల్లు రాజుపాలెం సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ నాయకులు, సత్తెనపల్లి పట్టణ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలోనైనా గ్రామస్థాయి పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, అందరి ఆమోదంతోనే మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నుకోవటం జరుగుతుందని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం సత్తెనపల్లి నియోజకవర్గంలోని గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శుల, మండల పార్టీ మాజీ నాయకులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు సేకరించకుండా నూతన మండల పార్టీ అధ్యక్షులు అంటూ పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయించడం తగదని తద్వారా గ్రామస్థాయిలో పార్టీకి ఎంతో నష్టం జరిగే ప్రమాదం ఉందని వివరించారు. ఆ కమిటీల్లో ఎన్నుకున్న నూతన అధ్యక్షులు కొందరు గతంలో జరిగిన స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రత్యర్థ పార్టీ అయిన వైసిపి తో జతకట్టి వారి గెలుపుకు కృషి చేయడానికి ఎంతగానో దోహదపడ్డారని అటువంటి నాయకులను నేడు మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నుకోవడం సరికాదని దీనివల్ల పార్టీలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో రెండో స్థానంలో ఉండి తెలుగుదేశంపార్టీకి బలమైన వర్గంగా ఉన్న ముస్లింలు గతంలో నకిరేకల్ మండల పార్టీ అధ్యక్షుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గా ఉండేవారు అలాంటిది ఈసారి ఏక్కడ స్థానం లేకపోవటం శోచనీయం, ఇప్పటికైనా పార్టీ అధిష్టానం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీలో ఏర్పడిన సంక్షోభాన్ని తొలగించి కమిటీల ఏర్పాటు గురించి పునరాలోచించాలని, రాబోవు ఎన్నికలలో మన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిని చేయటమే ఏకైక లక్ష్యంగా పనిచేసే నాయకులను అందరి అభిప్రాయాలు తీసుకొని ఎంపిక చేస్తే మంచిదని. అదేవిధంగా నాయకుడు లేని నావలా ఉన్న సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గానికి వైసీపీ నాయకుల అరాచకాలను ఎదిరించే సమర్థుడైన నాయకుడిని ఇన్చార్జిగా నియామించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు మండల, సత్తెనపల్లి పట్టణ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి వారి భజన కార్యక్రమంలో పాల్గొనతెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్రవర్మ



బాపట్ల జిల్లా ప్రజాపాలన నవంబర్.30. బాపట్ల టౌన్ అగ్రహారం శివాలయం నందు తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు శ్రీ గొల్లపల్లి,శ్రీనివాసరావు,మరియు శ్రీనివాస్ రెడ్డి గార్ల ఆధ్వర్యంలో వైభవంగా జరిగిన శ్రీ అయ్యప్పస్వామి వారి భజన కార్యక్రమంలో పాల్గొని ఆ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకొని, తదనంతరం నిర్వాహకులచే ఏర్పాటు చేయబడిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించి స్వాములకు ప్రసాద వితరణ చేసిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ లివేగేశన నరేంద్ర వర్మ.

## ప్రతి ఇంటికి అందిన సంక్షేమం: అంబటి రాంబాబు



సత్తెనపల్లి : ప్రజాపాలన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ సాయం అందుతుందని, అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉందని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. బుధవారం 13 వ వార్డులో కౌన్సిలర్ బండి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రివర్యులు అంబటి రాంబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన గృహిణులు, వృద్ధులు, వికలాంగులతో ప్రభుత్వ సంక్షేమలబ్ది ,పథకాలు అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల సేవలపై ఆరా తీశారు. స్థానికుల నుంచి వచ్చిన సమస్యలను విని, సత్వరం వాటికి పరిష్కార మార్గాలు చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి అందిస్తున్న రూ. 20 లక్షల నిధులతో సిసి రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం , విద్యుత్ స్తంభాల ఏర్పాటు , పల్లెల్లో ఉన్నఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు అధికారులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ నాయకులు, అధికారుల బృందంతో ఇంటింటికి తిరిగియోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల్లో 95% పైగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిందని, మీ అందరి ఆశీర్వాదంతో తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వార్డుల అభివృద్ధికి నిధులు సమీకరించి సమగ్ర అభివృద్ధి కి కృషిచేస్తామన్నారు. 320 కుటుంబాలను సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ , కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్ ,కమీషనర్ కొలిమి షమ్మీ, కౌన్సిలర్ లు, ఇతర నాయకులున్నారు.

## అయ్యప్పలకు సద్ది వడ్డించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి ప ట్టణ పరిధిలో అయ్యప్ప నగర్ లో వేంచేసియున్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయము నందు పట్ట ణ పరిధిలో గల దీక్ష స్వాములకు బుధవారం సద్ది ఏర్పా టు చేసి స్వయంగా తానే దీక్ష స్వాములకు వ డ్డించి న టీడీపీ జాతీయ కోశాధికారి %ద% మాజీ శాసన సభ్యు లు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈ కార్యక్ర మంలో పలువురు అయ్యప్ప స్వాములు ప్రజలు తదిత రు లు పాల్గొన్నారు.

## కరీముల్లాను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



న ం ది గా వ ం నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి పట్ట ణ పరిధిలో ఆరవ వార్డు నందు తెలుగుదేశం పార్టీ రా ష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి షేక్ కరీముల్లా ఇటీవల కా లంలో చెవి శాస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి చేరు కొనగా మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యవారిని స్థానిక తెదేపా నేతలతో కలిసి వారి స్వగృ హంలో కలుసుకొని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య ప రిస్థితిలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఇటీవల కాలంలో కరీముల్లా కనిష్ట కుమారుడు షేక్ తామిమ్ అన్సారి రోడ్డు ప్రమాదంలో చేతికి గాయమవ్వగా అన్సారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు యేచూరి రాము తదితరులు పాల్గొన్నా రు.

## రెడ్డిపాలెం గ్రామం చెరువులో మొసలి సంచారం



ప్రజాపాలన ప్రతినిధి(నవంబర్30):పల్నాడు జిల్లా ,రొంపిచర్ల మండలం: రెడ్డిపాలెం గ్రామంలో చెరువులో మొసలి సంచరిస్తుందని తహశీల్దార్ జె.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తులు ఎవరూ ఆ చెరువు వైపుకు వెళ్ళవద్దని సూచించారు. ఆ గ్రామస్తుల ద్వారా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అటవీ శాఖ అధికారులకు చెరువులో సంచరిస్తుందని మొసలిని తీసుకెళ్ళమని తెలియపరిచామని అన్నారు. గ్రామస్థులు భయపడవలసిన అవసరము లేదని అన్నారు. ఆ గ్రామంలో గల చెరువులో మొసలి సంచారంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు.

## వైసీపీ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం:

### నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు



పల్నాడు జిల్లా .నరసరావుపేట .నవంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి.): వైసీపీ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన సమయం ఆసన్నమైందని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు.శాసనసభలో టీడీపీ, అధినేత చంద్రబాబు చేసిన శపథాన్ని నెరవేర్చి ఆయన్ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కమిటీలు పనిచేయాలని సూచించారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా క్లస్టర్,యూనిట్,బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీలతో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.డిసెంబరు 1 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ కలిసి 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని వివరించాలన్నారు.

**'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' పోస్టరు ఆవిష్కరణ**

నరసరావుపేటలో టీడీపీ క్లస్టర్ ఇన్చార్జులతో కలిసి 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' పోస్టర్ను నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు కడియాల రమేష్,నరసరావుపేట మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు,రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షులు వెన్న బాలకోటిరెడ్డి,రాష్ట్ర తెలుగు రైతు నాయకులు గొట్టిపాటి జనార్ధన్ బాబు,కడియం కోటి సుబ్బారావు, రాష్ట్ర మైనార్టీ నాయకులు మన్నన్ షరీఫ్,మీరవాలి,మాబు,బడే బాబు,కదం నాగజ్యోతి,వాసిరెడ్డి రవి,ఆలపాటి శ్రీనివాసరావు,దండ శివరామకృష్ణ,కావూరి శ్రీనివాసరావు,అబ్బూరిశ్రీనివాసరావు,కందిమల్లవీరప్పయ్య పాల్గొన్నారు.

## మా బడి నాడు- నేడు పనుల ను వేగవంతంగా చేయాలి

### పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. నవంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి): మా బడి నాడు- నేడు పనుల పురోగతిలో వెనుక బడిన మండలాలు వేగంగా పురోగతి సాధించే లా చర్యలు పట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని ఎస్. ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి, ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్ల తో మా బడి నాడు నేడు పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా ప్రధానోపాధ్యాయులు మెడికల్ లీవ్ లో వెళ్ళిన వారు ఉంటే వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నాడు నేడు పనులలో ఆటంకం కలగకుండా చూడాలన్నారు. కొన్ని పాఠశాలల ప్రాంగణంలో శిధిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి ఆ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సానుకూల దృక్పథంతో సమిష్టి కృషితో అందరూ పనిచేయాలని అన్నారు. అవసరమైన చోట పనుల రద్దుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. సిమెంటు కొరత లేకుండా చూసే విధంగా సంబంధిత సిమెంట్ కంపెనీ యాజమాన్యాలతో చర్చించాలని లిఖితపూర్వకంగా కూడా కోరాలని పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు. రాష్ట్రంలో నాడు నేడు పనులలో పల్నాడు జిల్లా ముందు వరుసలో ఉన్నందుకు సంబంధించిన ప్రతి వారిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. త్వరలో స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ సిస్టమును ప్రారంభించనున్నామని ఆయా పాఠశాలలలో ఉపాధ్యాయుల బోధన అంశాలపై టీములవారీగా వెళ్లి పరిశీలించడం జరుగుతుందన్నారు. పరిశీలన నివేదిక అనుసరించి ఉపాధ్యాయుల ప్రావీణ్యతను గుర్తించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన ఉపాధ్యాయులకు వేసవికాలం సెలవులలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైజుస్ యాప్ వినియోగంపై స్పందనను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు లాగిన్లలో ఇంకా ఎస్. ఎం. ఎఫ్ అకౌంట్లను త్వరితగతిని తెరవాలని ఆదేశించారు. రివాల్వింగ్ ఫండును త్వరితన గతిన ఖర్చు చేయాలని సూచించారు. పనులు చేపట్టని పాఠశాలలలో ఉన్న నిధులను ఆయా మండలాలలో బెస్ట్ పెర్ఫార్మన్స్ కనపరిచిన పాఠశాలలకు బదలాయింపు చేసి పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి బాలు నాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ ఏ అధికారి విజయకుమార్ , ఆర్డబ్ల్యూఎస్ వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడెడ్ ఉపాధ్యాయులకు,సిబ్బందికి పదవీ విరమణ వయస్సును 62 సం. పెంపు పట్ల ఎపిటిఎఫ్ (1938) హర్షం




గుంటూరు,ప్రజాపాలన ప్రతినధి:-రాష్ట్రం లో పనిచేయుచున్న వివిధ ఎయిడెడ్ మేనేజ్మెంట్/ సంస్థలో పనిచేస్తున్న బోధన మరియు బోధన్ ఇతర సిబ్బందికి 62 సంవత్సరాలు వర్తింపజేస్తూ గెజిట్ ని విడుదల చేయడం చాలా సంతోషదాయకం అని ఎపిటిఎఫ్ (1938) గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు శ్రీ గోవిందు వెళాంగణిరాజు, మేకల సుబ్బారావు ఒక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి హర్షం తెలిపారు. ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అదేవిధంగా గౌరవనీయులు విద్యాశాఖ మాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణ గారికి, గౌరవనీయులు ప్రభుత్వ సలహాదారు శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి గారికి సి ఎం ఓ అధికారులకు ,విద్యాశాఖ అధికారులు అందరికీ హృదయపూర్వకంగా ధన్యవాదాలు. తెలుపుకుంటున్నాట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ కట్టెబోయిన నరసింహారావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శ్రీ విజయానంద్, గౌరవ అధ్యక్షుడు శ్రీ యం.వి.ప్రసాద్, జిల్లా సహాధ్యక్షులు శ్రీ పి.రమేష్, జిల్లా అదనపు కార్యదర్శి శ్రీ మోపిదేవి శివశంకర రావు,నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీ సాయిమల్లిఖార్జున రావు,శ్రీ జోజప్ప, శ్రీ ఆలా సురేష్, శ్రీ ఓ నాగార్జన తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై మైక్ ద్వారా అవగాహన



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి 30 :భీమునిపట్నం ట్రాఫిక్ ఎస్.ఐ చిరంజీవి ఆధ్వర్యంలో బుధవారం భీమునిపట్నం మండలం లోని పలు ప్రాంతాల్లోవాహనదారులుకు ట్రాఫిక్ పై ఆటో లో మైక్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలలోతగరపువలస, చిల్లపేట,భీమిలి, వలందపేట, తాళ్ళవలస తదితరప్రాంతాల్లో బైక్ మీద ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ , మైనర్లు డ్రైవింగ్ చేయరాదనీ, ఓవర్ స్పీడ్ తో ప్రయాణం చేయరాదనీ, అదేవిధంగా ఆటో ,కార్లు తదితర వాహనాలు మీద ప్రయాణం చేస్తే సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలనీ, త్రాగి నడపరాదనీ తదితర అంశాలను గురించి ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మద్దులమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్సీ కరుణ్ కుమార్



కంచికచర్ల నవంబర్ 30 ప్రజాపాలనప్రతినిధి మద్దు లమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చే స్తానని శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ అన్నారు మండల పరిధిలోని గొట్టుముక్కల గ్రామ అడవి ప్రాంతంలో వెలిసిన మద్దులమ్మ తల్లిని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ బుధవారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ మద్దుల మ్మ తల్లి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతో షంగా ఉందని మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని ఎంతో నమ్మకంతో కొలుస్తారని తెలిపారు అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆలయానికి వెళ్లే రోడ్డు మరమ్మత్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి బోర్లు భక్తులు కూర్చోవడానికి పాల పొంగ ళ్ళు నిర్వహించుకోవడానికి షెడ్డు నిర్మాణం ఎలక్ట్రిసి టీ సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గుదే. అప్పారావు, మార్తా. శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పార్టీ నాయకులు తదితరులు పా ల్గొన్నారు

## టీడీపీ నాయకుడి మృతికి డా.చదలవాడ అరవింద బాబు సంతాపం



పల్నాడు జిల్లా. నరసరావుపేట. నవంబర్ 30 (ప్రజా పాలన ప్రతినిధి.): రొంపిచర్ల మండలంలో ఎడ్వర్ట్ పేట గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు కొలికొండ రమేష్ బుధవారం మృతి చెందారు.కాగా మృతుడి తండ్రి కీ.శే.సైదయ్య గతంలో గ్రామ సర్పంచ్ గా పని చేశారు.మృతుని తల్లి కామేశ్వరమ్మ గతంలో జెడ్పీటీసీగా పని చేసి మండలానికి విశిష్టమైన సేవలు అందించారు.మృతుని సోదరుడు కొండలు టీడీపీ మండల నాయకులుగా పని చేస్తున్నారు.మృతుని తండ్రి సైదయ్య గ్రామ సర్పంచ్ గా గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను గాను ఆయన విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు.కాగా విషయం తెలుసుకున్న నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు హుటాహుటిన రమేష్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొద్ది రోజుల క్రితం మునమాక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోనేటి శ్రీనివాసరావు మరణం నుండి కోలుకోలేని పరిస్థితిలో మరో నాయకులు రమేష్ ఆకస్మాత్తుగా మృతి చెందటం బాధాకరమని అన్నారు.రమేష్ కుటుంబ సభ్యులు మండలంలో టీడీపీ విస్తరణకు,అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.పార్టీ కష్ట కాలంలో ఉన్న తరుణంలో నాయకులకు,కార్యకర్తలకు ధైర్యం చెప్పి ముందుకు నడిచే నాయకులు రమేష్ మృతి టీడీపీ తీరని లోటని పేర్కొన్నారు.రమేష్ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అదే విధంగా మండలంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు రమేష్ మృతికి సంతాపం తెలియజేశారు.



## కమ్యూనిటీ హాల్ నిర్మాణం క్రైస్తవులకు ఎంతో ఉపయోగం: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి.:జగ్గంపేట కమ్యూనిటీ హాల్ నిర్మాణం వలన క్రైస్తవ సోదరులకు ఎంతో ఉపయోగపడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండల మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు జాన్ వెస్లీ ఆధ్వర్యంలో 50 లక్షల రూపాయలు మైనార్టీ నిధులను వెచ్చించి నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలోని క్రైస్తవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కట్టడానికి నడుం బిగించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం జరిపారు గతంలో ఎన్నడూ లేనివిధంగా పేద నిరుపేద మధ్యతరగతి వంటి క్రైస్తవులకు వివాహ సమయంలో పడుతున్న ఇబ్బందులను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహాయంతో మైనార్టీ నిధులను ఈ నిర్మాణానికి ఉపయోగించనున్నట్టు అయిన తెలిపారు. ఇప్పటినుంచి నిర్మాణం పూర్తయిన తర్వాత నియోజకవర్గంలోని ప్రధానంగా జగ్గంపేట మండల పరిధిలోని క్రైస్తవులు అందరూ ఈ కమ్యూనిటీ హాల్ ను ఉపయోగించుకోవచ్చు అన్నారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ లీగల్ అడ్వైజర్ రెవ జార్జ్ బాబు కుమార్ పాల్ ఏర్పాటుచేసిన శంకుస్థాపన కార్యక్రమానికి జగ్గంపేట కిర్లంపూడి ఎంపీపీలు అతులూరి నాగబాబు, తోట రవి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి హేమ శైలు బాబు, జగ్గంపేట ఉప సర్పంచ్ బందారు రాజా, వైసీపీ నాయకులు మాజీమంత్రి తోట నరసింహం తనయుడు తోట రాంజీ, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్చార్జి పాఠం శెట్టి సూర్యచంద్ర, జగ్గంపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి మరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూముల రీసర్వే గురించి ఎమ్మార్వో



నకరికల్లు ప్రజాపాలన ప్రతినిధి(నవంబర్30): పల్నాడు జిల్లా,నకరికల్లు మండలం: చీమలమఱ్ఱి గ్రామములో వ్యవసాయ భూముల రీసర్వే గురించి శ్రీయుత తహశీల్దారు నకరికల్లు వారి అద్యక్షతన గ్రామ సభ ను నిర్వహించినారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పదకములో బాగముగా రాష్ట్రములో అత్యాదునిక సాంకేతిక పరిజ్ఞానముతో వ్యవసాయ భూముల రీ –సర్వే చేయబడుచున్న దని,ఇప్పటికే చీమలమఱ్ఱి గ్రామములో డ్రోన్ పరికరము ద్వారా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ లు తీసుకొని యున్నామని ,ప్రస్తుతము సర్వే ఆఫ్ ఇండియా వారిచే ఆర్తో రేక్టిఫైడ్ ఇమేజ్ లు గ్రామానికి వచ్చి యున్నాయని,వాటి ఆదారము గా గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ జరగనున్నదని,మరియు రోవర్ ద్వారా ప్రతి రైతు యొక్క భూ కమతముల యొక్క పాయింట్స్ తీసుకోవడం జరుగుతుందని, కనుక ఈ విషయములో చీమలమఱ్ఱి గ్రామములో వ్యవసాయ భూములు గల భూ యజమానులు అందరు సంబందిత భూ యాజమాన్య హక్కు పత్రములతో సర్వే చేయు సమయములో పాల్గొని రెవిన్యూ మరియు సర్వే సిబ్బందికి సహకరించవలసినదిగా తెలిపియున్నారని మీడియా వారికి తెలియజేయడ మైనది. ఈ కార్యక్రమములో గ్రామా రెవిన్యూ అధికారి,కే రమణ రెడ్డి ,గ్రామ సర్వేయర్లు ,గ్రామ పెద్దలు కావటి రామారావు ,దేవరశెట్టి శ్రీను ,చావా రామయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ఆర్డీవో రవీం దర్రావు




నందిగామ నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి పట్ట ణంలోని స్థానిక ఎం.ఆర్.ఆర్ కళాశాల యందు జగ నన్న విద్యాదీవెన పథక కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా స్థానిక ఆర్డిఓ రవీందర్రావు పాల్గొని ప్రభుత్వం నుం చి మంజూరు అయిన చెక్కును విద్యార్థినీ విద్యార్థు లకు ప్రదర్శించారు.

## జ్యోతుల నవీన్ పాదయాత్ర పూర్తయిన సందర్భంగా తిరుపతి మొక్కు చెల్లించుకున్న నారా ప్రసాద్



గోకవరం ప్రజా పాలన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన నారా ప్రసాద్ జ్యోతుల నవీన్ పాదయాత్ర విజయవంతం కావాలని తిరుపతి వెంకన్నని ముక్కు చెల్లించిన నారా ప్రసాద్ గారు పాదయాత్ర నిర్వహించిన జ్యోతుల నెహ్రూ గారి తనయుడు నవీన్ ఇటీవల ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహించిన కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాదయాత్ర కిర్లంపూడి గండేపల్లి గోకవరం మండలాల విజయవంతం అయిన సందర్భంగా నారా ప్రసాద్ మాట్లాడుతూ గోకవరం మండలంలో పలు సమస్యలపై తెలుసుకుంటూ నవీన్ పాదయాత్ర పూర్తి కావడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తిరుపతి వెంకన్నకు ముక్కు తీర్చుకున్నారు జగ్గంపేట మండలం కూడా విజయవంతం కావాలని ఆ వెంకన్నను దర్శించుకున్న నారా ప్రసాద్

## 5వేల మంది పేదలను మోసం చేసిన ఎమ్మెల్యే..: జీ.వీ.ఆంజనేయులు



పల్నాడు జిల్లా .వినుకొండ .నవంబర్ 30 (ప్రజా పాలన ప్రతినిధి.): వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ పట్టణంలోని ఐదువేల మంది పేదలకు కొండల్లో గుట్టల్లో సెంటు స్థలమిచ్చి 6 లక్షలు లబ్ధిదారునికి వెలకట్టి తీవ్రంగా మోసం చేశాడని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆరోపించారు. పట్టణంలోని 16 వార్డుల్లో పట్టణ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించగా జీ.వి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉద్దేశించాయని మాట్లాడుతూ నిత్యవసరాల ధరలు పెరిగి సామాన్యుడు జీవనం కష్టతరంగా మారితే నియంత్రించాల్సిన ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచడమే కాక ఇంటి పన్ను చెత్త పన్ను అంటూ అనేక పనులతో ప్రజలపై బాదుడే బాదుడు చేస్తూ దోచుకుంటున్నారని అన్నారు. ఎడమ చేత్తో రూపాయి ఇస్తూ కుడి చేత్తో 100 రూపాయలు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో పట్టణాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, టిడిపి పాలనలో అభివృద్ధి తప్ప నేడు వైసిపి ప్రభుత్వంలో చేసిందేమీ లేదని అన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పట్నంలోని ఐదువేల మంది పేదలకు తీవ్ర అన్యాయం చేశాడని, పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో 6వేలు కూడా విలువ చేయని సెంటు ఇళ్ల స్థలాన్ని 6 లక్షలు లబ్ధిదారుడు పొందినట్లు ప్రభుత్వం వెలకట్టడం దారుణమన్నారు. టిడిపి ప్రభుత్వంలో పేదలకు టిట్కో ఇల్లు 90% పూర్తిచేస్తే 10% పూర్తి చేయలేని వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో వేలకోట్లు దోచుకున్నారని అన్నారు. దానిలో భాగంగానే వినుకొండలో ఎమ్మెల్యే బోల్లా బ్రహ్మనాయుడు ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికే అమ్మి పేదలకు అన్యాయం చేశారని అన్నారు. పట్టణంలోని 32 వార్డుల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులు తన సొంత స్వార్థం కోసం కొండచిట్టు భూములు కొనుగోలు చేసి వాటి విలువలు పెంచుకునేందుకు గిరి ప్రదర్శన రోడ్ అంటూ మున్సిపల్ నిధులతో నిర్మిస్తూ ప్రజలకు ద్రోహం చేస్తున్నాడని అన్నారు. వినుకొండలో అన్ని అనధికారిక చర్యలకు పాల్పడుతూ అనేకమంది ప్రజలకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. నిత్యం అబద్ధాలాడుతూ అసత్యాన్ని నిజం చేయాలని నటుడు బ్రహ్మనాయుడు చేస్తున్న మాయ ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. పట్టణంలో పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ వందల కోట్లు వెనకేసుకున్న బ్రహ్మనాయుడు అవినీతి అక్రమాలను త్వరలో ప్రజలే బహిర్గతం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో. రాష్ట్ర టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## 90వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు.. మద్దతుగా జనసేన వీర మహిళలు



అమలాపురం:నవంబర్30 ప్రజాపాలన ప్రతినిధి.:అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి భవాని ఆత్మహత్య కేసు పై కుటుంబానికి న్యాయం చేయాలంటూ అమలాపురం కలెక్టరేట్ ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు, నేటికీ 90 రోజులు పూర్తయిన తగిన న్యాయం జరగలేదని ఉప్పలగుప్తం మండలం జనసేన వీర మహిళలు బుధవారం దీక్షా శిబిరానికి చేరుకుని మృతి భవాని కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలకు రక్షణ కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని పనిచేసే ప్రతి చోట వివక్ష కు గురవుతున్నారని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి భవాని వైసీపీ నాయకుడు దంగేటి రాంబాబు అతను అనుచరులు వేధింపులకు గురి చేస్తున్నారని తప్పుడు ఫిర్యాదులు చేసే ఇబ్బంది పెడుతున్నారని కలెక్టర్ మంత్రి విశ్వరూప్ కు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాధుడే లేరన్నారు తిరిగి తిరిగి ఎక్కడ న్యాయం జరగకపోగా వేధింపులు మరింత ఎక్కువ అయ్యాయని మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకునేలా చేశారన్నారు ప్రధాన కారకుడైన దంగేటి రాంబాబుని అరెస్టు చేయకుండా ప్రభుత్వం కాపాడుతుంది అనిజనసేన వీర మహిళలు భవాని కుటుంబానికి ఉద్యమానికి అండగా ఉంటామన్నారు. భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 90వరోజుకి చేరుకున్నాయి. దీక్షకు మద్దతు తెలిపిన వారిలో ఎంపీటీసీ పల్లె శాంతి ,తిక్క సరస్వతి ,అయితా బత్తుల ఉమామహేశ్వరరావు నామాడి శివాజీ . వి సి కె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ,మెండి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## 25,64,64,709/ కోట్లు రూ తల్లుల ఖాతాకు జమ, పేదలు తలరాతలు మార్చే శక్తి విద్యకు మాత్రమే, డి ఆర్ ఓ సత్తిబాబు.



అమలాపురం: నవంబర్30 ప్రజాపాలన ప్రతినిధి.:బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో అన్నమయ్య జిల్లా మదనపల్లి నుండి నాలుగో విడత పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ జూలై 2022 నుండి సెప్టెంబర్ 22 త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన నిధులను విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల ఖాతాకు నేరుగా డిబిటి విధానంలో బటన్ నొక్కి జమ చేశారు. పేదరిక నిర్మూలన, పేదలు తలరాతలు మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో అన్నమయ్య జిల్లా మదనపల్లి నుండి నాలుగో విడత పూర్తి ఫీజు రియంబర్స్మెంట్,జూలై 2022 నుండి సెప్టెంబర్ 22 త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన నిధులను విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల ఖాతాకు నేరుగా డిబిటి విధానంలో బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.బాల బాలికలు ప్రతి ఒక్కరు చదువు కోవాలన్నదే ప్రభుత్వ ఆశయమని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు సంస్క రణలను తీసుకుని వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ,సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మరియు ఎగ్జిక్యూటివ్ అధికారి పి జ్యోతిలక్ష్మి దేవి సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది స్థానిక ఎంపీపీ కే భాగ్యలక్ష్మి హితకరిణి సమాజం చైర్మన్ కాశీ మునికుమారి పాల్గొన్నారు.

## ఇదేమి కర్మ - ఈ రాష్ట్రానికి..: టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి నవంబర్ 30 : ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం, రాష్ట్ర ప్రజల ఆర్థిక ఇబ్బందులు, సామాన్యులు నుండి అన్ని వర్గాల ప్రజలు సైతం పడుతున్న తంటాలతో రాష్ట్రం కుదేలవుతుందని, ఎన్నడూ లేని పాలన వైఫల్యాలతో " ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికీ" అనే మీమాంసలో రాష్ట్ర ప్రజలు ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రంలో గాని, దేశంలో గాని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ ఎవరూ చూసి ఉండరని గంటా నూకరాజు వ్యాఖ్యానించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల తంటాలు తప్పా ఏ ఒక్కరిలో కూడా ఆనందం లేదని వాపోయారు. పెరిగిన నిత్యావసర ధరలు ఒకపక్క, కుంటుపడుతున్న ఉపాధి అవకాశాలు మరోపక్కతో ప్రజలు నానా తంటాలు పడుతుంటే,. అదీకాక అధికార పార్టీ నేతలు చేస్తున్న అరాచకాలతో ప్రజలు బెంబలెత్తిపోతున్నారని అన్నారు. ఆంగ్లేయుల పాలనలో ప్రజలు ఎన్ని బాధలు పడ్డారోగాని, ఈ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలయొక్క బాధలకు అంతేలేదని వాపోయారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, మహిళలకు రక్షణ లేకపోవడం దేనికి సంకేతమని అన్నారు.

## హలో నేస్తం ప్రోగ్రాంతో వేల మందికి సాయం చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్

**చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతలపూడి శ్రీనివాసరావు**



పిడుగురాళ్ల.... నవంబర్30. ..ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలోని పల్నాడు హాస్పిటల్ లో చింతలపూడి చార్టబుల్ ట్రస్ట్ అధినేత చింతలపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం హలో నేస్తం కార్యక్రమం గురజాల నియోజకవర్గంలో పొలిటికల్ హిట్ తెప్పించేలా ఉందని మేధావులు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు శ్రీనివాసరావు మాత్రం తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించే సహాయాలను ప్రజాసేవలాగే చూడాలని ట్రస్టుకు రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదంటున్న చింతలపూడి శ్రీనివాసరావు పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామంలో పుట్టిన చింతలపూడి శ్రీనివాసరావు చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదిగారు అప్పటినుంచి పుట్టిన ఊరికి వెనకబడిన పలనాడు ప్రాంతానికి ఏదో చేయాలని 2014లో చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ని స్థాపించారు నుండి నేటి వరకు వందల సేవా కార్యక్రమంలో వేల మందికి ఆర్థిక సహాయాలు అందించారు ధనాన్ని అందరూ సంపాదిస్తారు కానీ దానం చేసే గుణం కొందరికే ఉంటుందని నిరూపిస్తున్నారు చింతలపూడి ట్రస్ట్ స్థాపించిన అనంతరం చింతలపూడి తన సోదరుడైన డాక్టర్ చింతలపూడి అశోక్ పల్నాడు హాస్పిటల్ ప్రారంభించేలా చేసి అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు మోకాలు మార్పిడితో గోల్డ్ మెడలిస్ట్ సాధించిన అశోక్ కుమార్ అన్న శ్రీనివాసరావుకు తగ్గ తమ్ముడుగా వైద్య రంగంలో అందుకుంటున్నారు మనకోసం చేసేది మనతో పోతుంది ఇతరుల కోసం చేసేది శాశ్వతంగా ఉంటుంది అన్న భావంతో ప్రజల కష్టాలు బాధల్లో పాలు పంచుకోవాలన్న సంకల్పంతో పల్నాడులో పార్టీలు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజాసేవలో మంచి మననలు పొందారు బెస్ట్ హీరో చింతలపూడి శ్రీనివాసరావు అని పల్నాడు ప్రాంత వాసులు అనుకుంటున్నారు చింతలపూడి చారిటబుల్ వ్యవస్థాపకులు చింతలపూడి శ్రీనివాసరావు మనకు ఉన్నంతలో ఇతరులకు సహాయపడాలన్నది ఆయన వ్యక్తిత్వం చింతలపూడి శ్రీనివాసరావు ఎన్ఆర్ఐ లో ఓ సాఫ్ట్వేర్ కంపెనీకి సీఈవో ఆయన మాత్రం ప్రజాసేవ అంటున్నాడు. చింతలపూడి శ్రీనివాసరావు పల్లెల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను సైతం ఫ్రీగా పంపిణీ చేశారు పార్టీలకు అతీతంగా తమ దగ్గరకు వచ్చిన పేద మధ్యతరగతులకు వికలాంగులకు వృద్ధులకు లేదనకుండా ఆర్థిక సహాయం చేశారు హలో నేస్తం పేరుతో వందల మంది కౌలు రైతులకు 6000 తక్షణ సహాయంగా అందిస్తూ తన మానవత్వాన్ని చాటుకున్నారు నేడు ప్రతి పల్లెను ఆరోగ్యవంతం చేయాలని సంకల్పంతో బస్సును ఏర్పాటు చేసి ఆ బస్సుని అతిథుల మధ్య ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని చింతలపూడి శ్రీనివాసరావు తెలిపారు.

## షెపర్డ్ స్వచ్ఛంద సంస్థను సందర్శించిన మాజీ ఎమ్మె ల్యే తంగిరాల సౌమ్య






చందర్లపాడు నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి మం డల పరిధిలోని చింతలపాడు గ్రామంలో షెపర్డ్ అనే సంస్థ ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు బ్యూటీషి యన్ కోర్సులు తదితర సేవా కార్యక్రమాలను నిర్వ హిస్తున్న రాంబాబు మాస్టర్ స్వచ్ఛంద సేవా సంస్థ శి బిరాన్ని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఇటువంటి బృహత్కర కార్యక్రమాలు చేప ట్టడం నిజంగా అభినందనీయంఅన్నారుఈ సంస్థ ద్వారా ఇప్పటికే ఆరు బ్యాచులు పూర్తి అయ్యి ఇప్పు డు ఏడవ బ్యాచ్ శిక్షణ తీసుకోవడం చాలా సంతోషం ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొ వాలన్నారు



# నిర్మాణ పనులు మొదలైన 30 మాసాల్లో బందరు పోర్టు సిద్ధం: పేర్ని నాని



మచిలీపట్నం టౌన్ : నవంబర్ 29: ప్రజాపాలన :బందరు పోర్టు నిర్మాణం మొదలైన 30 మాసాల్లో శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మెగా ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం చేసుకోనుందని మాజీ మంత్రివర్యులు, కృష్ణాజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రకటించారు. బుధవారం ఉదయం ఆయన స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో బందరు పోర్టుకు సంబంధించిన పలు విషయాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా వాసుల చిరకాల వాంఛ బందరు పోర్టు అని.. 18 ఏళ్ళ నుంచి తమ కల సాకారం కాకపోవటం జిల్లా వాసులు చేసుకున్న దురదృష్టమని పేర్ని నాని అభిప్రాయపడ్డారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం వల్లే పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని ఆయన వివరించారు. వైఎస్సార్ కుమారుడు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లావాసుల చిరకాల స్వప్నం సాకారమవుతుందన్నారు. న్యాయపరమైన చిక్కుల వల్ల ఆలస్యం అయ్యిందని తెలిపారు. ఇప్పుడు అన్ని అడ్డంకులు తొలగిపోయాయని వివరించారు. రెండు, మూడు వారాల్లో కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు వస్తాయనే ధీమా ఎమ్మెల్యే పేర్ని నాని వ్యక్తం చేశారు. బందరు పోర్టు నిర్మాణానికి 5,253.88 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నట్లు, ఇందులో 75 శాతం బ్యాంకు రుణం, 25 శాతం ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేస్తోందన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 75 శాతం రుణం ఆమోదించిందని చెప్పారు. సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి వైపు 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్స్ వాటర్ గోడల నిర్మాణాలకు రూ. 446 కోట్లు అవసరం అవుతాయన్నారు. ఉత్తరం వైపున 250 మీటర్ల కొండరాళ్లతో కాంక్రీట్ గోడ నిర్మాణానికి రూ. 10. 94 కోట్లు, అలాగే దక్షిణం వైపున సదన్ బ్రేక్ వాటర్ రూ. 435 కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. 4. 6 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వాల్సివస్తుందన్నారు. డ్రెడ్జింగ్ కోసం మరో రూ. 1242.88 కోట్లు, సముద్రం నుంచి ఓడలు రావడానికి అప్రోచ్ ఛానెల్ నిర్మాణానికి రూ. 706.26 కోట్లు, బ్రేక్ వాటర్ మధ్యలో ఓడలు తిరగడానికి టర్నింగ్ సర్కిల్, బెర్త్ పాకెట్స్ కోసం రూ. 452.07 కోట్లు కావాలన్నారు. బందరు పోర్టులో మొదటి విడతగా 4 బెర్తుల నిర్మాణం జరుగుతుందని.. మూడు బెర్తుల కోసం రూ. 548 కోట్లు, బల్క్ కార్గో కోసం ఒక బెర్త్ .. దీనికి రూ. 158 కోట్లు వ్యయం అవుతుందని ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్పులు సైతం సురక్షితంగా రాగలుగుతాయన్నారు. లక్ష నుంచి లక్షన్నర బరువుతో ఉండే షిప్పులు వచ్చే బెర్తులను సెకెండ్ ఫేజ్' లో నిర్మిస్తామన్నారు. అదేవిధంగా బందరు పోర్టు నిర్మాణానికి 1730 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో ఒక్క ఎకరం ప్రైవేట్ భూమి కూడా తీసుకోవడం లేదన్నారు. రైల్, రోడ్డు నిర్మాణానికి 235 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)లను నిర్మించాల్సి ఉంటుందని పేర్ని నాని చెప్పారు. ఇప్పటికే భూమి ఉన్న విజయవాడ రోడ్డు నుంచి మచిలీపట్నం వచ్చే ప్రధాన రహదారిని 6 లైన్ల రహదారిగా ఆధునీకరించనున్నట్లు అందుకు తగినట్లుగా త్వరలోనే డీ పి ఆర్ చేయమని ఆదేశాలు సైతం వెలువడినట్లు చెప్పారు, మచిలీపట్నం పోర్టును 30 మాసాల్లో శరవేగంగా పూర్తి చేసే విధంగా మెగా ఇంజినీరింగ్ నిర్మాణ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. 2023 జనవరి నెలాఖరున లేదా ఫిబ్రవరి నెలలో సీఎం జగన్ పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని నాని తెలిపారు . ఈ సమావేశంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ , డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, ముడా ఛైర్మెన్ బొర్రా నాగ దుర్గా భవాని విఠల్, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ షేక్ సలార్ దాదా, మచిలీపట్నం మాజీ జడ్పిటిసి సభ్యులు లంకె వెంకటేశ్వరరావు (ఎల్వి యార్), మచిలీపట్నం మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ షేక్ ముస్తఫా (అచ్చాబా) పలువురు కార్పొరేటర్లు, కో- ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో జరిగే, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదంచేయండి: సిఐటియు



కంచికచర్ల నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధిడిసెం బర్ 5 న విజయవాడ లో జరగనున్న ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చే యాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమ ల పిలుపునిచ్చారు. కంచికచర్ల ఎన్జీవో కార్యాలయం లో యూనియన్ నాయకులతో కలిసి విలేకరుల స మావేశంలో మాట్లాడారు. ఆశా వర్కర్లకు నిర్దిష్టపని గంటలు లేవని, ప్రభుత్వ ఉద్యోగులు కాదని, అలాం టివారికి రోజు మూడుసార్లు ఫేస్ మస్థర్ వేయాలని, ప్రభుత్వం ప్రకటన చేయటం సరైన కాదన్నారు.,ఆ ని ర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.ఫ్రంట్ లైన్ వారియర్స్ గా నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను, సంతకాలు పేరుతో సచివాలయాలు సబ్ సెంటర్లలో కూర్చోబెట్టటం, 104 వెహికల్ వచ్చినప్పుడు,ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులుఅయిన, బి పి ,షుగర్ టెస్ట్లు చేయడం,మందులు ఇవ్వడం, సబ్ సెంటర్లు దులపడం, నీళ్ళు పెట్టడం, పిచ్చి మొక్కలు పీకటం, చెత్త శుభ్రం చేయడం, వ్యాక్సిన్ క్యారీలు మోయించటం తో పాటు, ఆన్ లైన్ వర్కు కూడా చేయా లని, అధికారులు ఒత్తిడి చేయడం మానుకోవాలని అన్నారు.ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోతే అది ఆశ వర్కర్ తప్పు ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు. ఫోన్లు పనిచేయకుండా డ్యూటీ చేసిన ఫో టోలు పెట్టాలని పెట్టకపోతే మీరు పనిచేసినట్టు కా ద ని మీ జీతాలు ఆపుతామని సొంత ఫోన్ ద్వారా ప నిచేయాలని బెదిరిస్తే చూస్తూ ఊరుకోం అని ఆమె హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 5న జరిగే జి ల్లా మహాసభలో ఆశ వర్కర్లు ఎదుర్కునే సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించి ఆందోళ న పోరాటాలను రూపొందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పి. పుల్లమ్మ, వి.నాగమ్మ, వి.ప్రసన్న, గోవిందమ్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

## యనమదుర్రు వంతెనలకు త్వరలో మోక్షం



భీమవరం, నవంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) :యనమదుర్రు డ్రైనుపై నిరుపయోగంగా ఉన్న మూడు వంతెనలకు త్వరలోనే మోక్షం కలగనుందని శాసనసభ్యులు గ్రంధిశ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని చేపల మార్కెట్ వద్ద ఉన్న యనమదుర్రు డ్రైనుపై వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యనమదుర్రు డ్రైనుపై ఉన్న మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిమిత్తం రూ. 36 కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందని త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగిసి పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఆధునిక డిజైన్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఈ రామరాజు, జెఈ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా అస్మా ఫర్హీన్ విధులు ప్రశంసనీయం: ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా ఎస్పీ పి జాషువా



మచిలీపట్నం క్రైమ్ : నవంబర్ 29: ప్రజాపాలన :కృష్ణాజిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా శ్రీమతి అస్మా ఫర్హీన్ నిర్వహించిన విధులు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ పి జాషువా ఐపీఎస్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం వెళ్తున్న సెబ్ అడిషనల్ ఎస్పీ కి ఈరోజు స్థానిక ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి జాషువా ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఎస్పి తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ వెంకట రామాంజనేయులు , రవాణాశాఖ అధికారి సీతాపతి , జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ మరియు సెబ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సెబ్ అడిషనల్ ఎస్పీ తో కలిసి విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ విధి నిర్వహణలో ఎదుర్కొన్న అనుభవాలను, అన్నింటిని నెమరు వేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు.ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పనిచేసింది కేవలం ఆరు నెలలు అయినప్పటికీ నాటు సారాను అరికట్టడంలో విశిష్ట కృషి కృషి చేశారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి కేసుల కన్నా అవగాహన వల్లే నాటు సారాను అరికట్టగలమని నిరూపించారు. ఎప్పటికప్పుడు ఆదేశాలను పాటిస్తూ నాటు సారాను స్వచ్ఛందంగా విడిచిన కుటుంబాలకు జీవనోపాధి కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. ఈ విధంగా విశిష్ట కృషిచేసి బదిలీపై వేరే జిల్లాకు వెళుతున్న శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ వెళ్లిన ప్రాంతంలో కూడా మరింత పేరు ప్రఖ్యాతలు గడించాలని ఎస్పీ ఆశించారు ,అనంతరం ఎస్పీ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ని సాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. తదుపరి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట రామాంజనేయులు , రవాణా శాఖ అధికారి సీతాపతి , పోలీస్ మరియు సబ్ అధికారులు, సిబ్బంది సాలువా వాళ్ళతో సత్కరించి పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భరత్ మాతాజీ , మాసూం భాష , మహబూబ్ బాషా , సత్యానందం , సబ్ డిఎస్పి కృష్ణకుమారి , పోలీస్ మరియు సబ్ అధికారులు ,సిబ్బంది చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



చందర్లపాడు నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి:మండలంలోని లక్ష్మీపురం మరియు గుడిమెట్ల గ్రామాలలో ఒక్కొక్క అంగన్వాడి కేంద్రానికి రూ. 16 లక్షల చొప్పున వెరసి మొత్తంగా రూ. 32 లక్షలతో చేపట్టనున్న 2 అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణాలకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారని ,ఇప్పు డు వాటిలో సౌకర్యాల కల్పన ఆధునీకరణపై దృష్టి సారించారన్నారు ,అలాగే కొత్త కేంద్రాల నిర్మాణాలు చేపట్టి ఆధునీకరణ ఉట్టిపడేలా అంగన్వాడీ కేంద్రా లను రూపుదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణను రూ పొందించి ,ఒకవైపు చిన్నారులకు బోధన, సమతుల్య ఆహారం పంపిణీతో పాటు గర్భిణీలకు అన్ని వసతు లు ఒకేచోట లభించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు ,ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలను దశలవారీగా సొంత భవనా ల్లోకి మార్చే ప్రక్రియకు వైయస్ జగన్ ప్రభుత్వం శ్రీకా రం చుట్టిందని ,ప్రీ స్కూళ్లలో బోధన అత్యంత సులు వుగా ఇంగ్లీష్ మీడియంలో సాగించేందుకు అవసరమై న కిట్లను ఇప్పటికే సరఫరా చేస్తున్నట్లు చెప్పారు ,మ రోవైపు బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని, పా లు, ఇతర మందులను అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాం టి అవకతవకలు జరగకుండా అందించే దిశగా చర్య లు తీసుకుందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పం చ్ ఆల సైదమ్మ , వైస్ ఎంపీపీ కల్పన ,జడ్పిటిసి ము క్కపాటి నరసింహారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నా యకులు ఆల రామారావు , యార్లగడ్డ సత్యనా రా యణ ప్రసాద్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెలగ పూడి వెంకటేశ్వరరావు , మండల పార్టీ కన్వీనర్ కం దుల నాగేశ్వరరావు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు .

## "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రతీ కార్యకర్త విజయవంతం చేయాలి:మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధిఓట్లు వేసిన ప్రజలు తమకు ఇదేం కర్మ అని భావిస్తున్నా రని.ఈ ఉద్దేశ్యం తోనే అధినేత చంద్రబాబు ఈ కార్య క్రమాన్ని తీసుకొచ్చారని, ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు నాయకులంతా కృషి చేయాలని పార్టీ శ్రేణులతో కలసి మాజీ శాసనసభ్యురాలు తం గిరాల సౌమ్య పిలుపునిచ్చారు బుధవారం తన కా ర్యాలయంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ప్రచార (పోస్టర్) గోడపత్రికను పార్టీ నేతలతో కలసిఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతజగన్ పాల నతో నష్టపోయిన వారికి అండగా ఉండేందుకే చంద్ర బాబు నాయుడు గారు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తు న్నారన్నారువైసీపీ సర్కార్ ఆగడాలు ఒకవైపు ప్రజ లకు వివరిస్తూనే మరోవైపు ప్రజలను చైతన్యపర్చడం ఇదేం కర్మరా మన రాష్ట్రానికి ముఖ్య ఉద్దేశంఅన్నారు.రాష్ట్రంలోని ప్రజల ఈ దుస్థితికి జగన్మోహన్ రెడ్డి ప్ర భుత్వ అసమర్థత అవినీతి అరాచక పాలనే కారణ మని ప్రజలు గుర్తించేలా చేస్తామని తెలిపారు.

## ఆకస్మిక తనిఖీ లు చేసిన జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర



అయినవిల్లి నవంబర్30 ప్రజాపాలన ప్రతినిధి.:ధాన్యం కొనుగోలు కేంద్రం నందు విలస గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ఆకస్మిక తనిఖీ చేసారు. వివరాలు లోకి వెళ్ళి తే అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం బుధవారం ఉదయం జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ,విలస గ్రామంలో మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రంని ఆకస్మిక తనిఖీలు చేసారు.ఈ సందర్భంగా ఆయన ముందుగా మండలం రెవెన్యూ మరియు అగ్రికల్చరల్ ఆదికారుల తో సంబంధించిన రికార్డు లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు వెంట వెంటనే ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాల న్నారు. తదుపరి రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొచ్చారు.రైతులకు ఎక్కడా నష్టం కలగకుండా తగు చర్యలను చేపడుతున్నామని , గన్నీ బ్యాగులు ఎప్పుడు కప్పుడు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆయన ఈ తనిఖీ లలో భాగంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాలు, స్థానిక సర్పంచ్ కుసుమ మంగేష్కర్, సునీల్, స్థానిక జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు ఎంపీపీ భర్త మట్టపర్తి పండు, ఎమ్మార్వో, ఎండిఓ, ఎం ఏ ఓ, మరియు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించాలి: రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు



కొత్తపేట నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి.:రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద 3 క్లస్టర్ సమావేశం ఈరోజు బుధవారం జరిగింది.ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు నుద్దేశించి సత్యానంద్ రావు మాట్లాడుతూ..వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు.అనంతరం కొత్తపేట నియోజకవర్గంలోఇదేం ఖర్మ మన రాష్ట్రానికిఅనే కార్యక్రమం యొక్క గ్రామాల పర్యటన, షెడ్యూల్ ను వివరించారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి చిలుకూరి సతీష్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల పట్టాభి రామారావు, ముత్యాల బాబ్జి, యూనిట్ ఇన్చార్జిలు చింతా శ్రీరామరెడ్డి, దాట్ల రాకేశ్ వర్మ, జక్కంపూడి బాలాజీ, కోటి రమాదుర్గ,కోటవెంకటేశ్వరరావు, కోట శేఖర్, సాధనాల బాబీ, మెడపాటి గంగిరెడ్డి, పులగం శ్యామ్, కొవ్వూరి, అచ్చిరెడ్డి, యల్లమిల్లి సత్యనారాయణ, జంపన శ్రీనివాసరాజు, కొక్కిరిగడ్డ శ్రీను, కోట సత్యనారాయణ, కర్రీ తిరపరెడ్డి, దాసరి శ్రీనివాస్, కృష్ణ రెడ్డి, జక్కంపూడి నాని, కర్రీ వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కమిషనరుపై ఎమ్మెల్యే గ్రంధి ఆగ్రహం



భీమవరం, నవంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) :పట్టణంలో మరొకసారి చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ బుధవారం భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామానికి వెళ్తున్న సమయంలో రెస్ట్ హౌస్ రోడ్లో గంగానమ్మ గుడివద్ద రోడ్డుపై చెత్త ఉండటం చూసి కమిషనర్ ఎస్ శివరామకృష్ణకు ఫోన్ చేసి వెంటనే రెస్ట్ హౌస్ రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించి చెత్తను తీయించాలని ఆదేశించారు. దెయ్యాలతిప్ప నుండి తిరిగి వస్తున్న సమయంలో చెత్త ఇంకా కనిపించడంతో ఆయన కమిషనరుకు ఫోన్ చేసి రమ్మన్నారు. కమిషనర్ శివరామకృష్ణ అక్కడికి రాగా ఉదయం తాను ఫోన్ చేసి చెత్తను తొలగించాలని చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ తాను ఇక్కడ వచ్చి వెళ్లానని చెప్పడంతో శాసనసభ్యులు కమిషనరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శానిటేషన్ విషయంలో తాను రాజీ పడనని పట్టణంలో ఎక్కడైనా చెత్త కనిపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. భీమవరం జిల్లా కేంద్రం అనే విషయాన్ని అధికారులు గుర్తించుకొని బాధ్యతగా పనిచేయాలని పట్టణ అభివృద్ధికి పనిచేసే అధికారులు తనకు కావాలని కబుర్లు చెప్పే అధికారులు వద్దని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారుల వైఖరిలో మార్పు రాకపోతే ప్రభుత్వపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎస్వీఈఈపి ద్వారా ఓటు హక్కును వినియోగించుకోండి: కలెక్టర్ హిమాన్షు శుక్లా




అమలాపురం నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :భారత ఎన్నికల సంఘం ఓటర్ గా నమోదుకు అర్హత తేదీ 2023 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా విద్యార్థిని విద్యా ర్థులకు పిలుపునిచ్చారు. బుధవా రం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నందు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకే షన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ఎస్ వి ఈ ఈ పి. ప్రోగ్రామ్ కింద కార్యకలాపాలైన ఎన్నికల జాబితాలో పేరు నమోదు, ఓటు హక్కు విశిష్టత గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన పెంపొం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు జనవరి ఒకటి నాటికి నిండుతున్న ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పౌరుడు, తనను తాను జనరల్ ఓటర్‌గా నమోదు చేసు కోవచ్చునని నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఫారం 6 నింపి ఓటర్ గా నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎన్ ఎస్ వి బి వసంతరా యుడు, మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు స్థానిక తహసిల్దార్ పి శ్రీ పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ ,కరస్పాండెంట్ నరసింహా రావు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గురజాడ



భీమవరం, నవంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) :దేశభక్తిని జీవన విధానంగా ఒకదేశం అభివృద్ధి చెందే ప్రణాళికను దేశభక్తి గేయంగా అందించిన మహాకవి కవిశేఖర గురజాడ అప్పారావు అని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞానకేంద్రం కార్యదర్శి వి. రాధాకృష్ణ అన్నారు. బుధవారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా డాక్టర్ సి.ఎస్.ఎన్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సభలో గురజాడకు ఘన నివాళులర్పించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న రాధాకృష్ణ మాట్లాడుతూ గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా గీతం జాతీయగీతంగా, విశ్వగీతముగా గుర్తింపు పొందవలసిన ఆవశ్యకత ఉందన్నారు. తెలుగు సాహిత్యాన్ని తన వ్యవహారిక భాష ద్వారా సుసంపన్నం చేసిన ఘనత గురజాడకే దక్కుతుందన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం లక్షలాది ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. దేశమును ప్రేమించుమన్నా ..మంచి అన్నది పెంచుమన్నా. గేయమును పాడి విద్యార్థులను ఉద్రూతలూగించారు. మహాకవులు మానవ ఆవాసాన్ని స్వర్గతుల్యం చేయాలని కలలు కంటారని ఆ కలలను , భవిష్యత్తు తరాలకు చెందినవారు,యువతరం సాకారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## భారీ బైక్ ర్యాలీ





నూజివీడు నవంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి: టిడిపి సీనియర్ నేత, నూజివీడు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నాడు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రావిచర్ల గ్రామం నుండి ముసునూరు మండలం బలివే గ్రామ సమీపంలోని విజయరాయి వరకు ఈ బైక్ ర్యాలీ కొనసాగించారు. జగన్ పాలనలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమాన్ని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న శుభ సందర్భంగా టిడిపి శ్రేణులు పార్టీ జెండాను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి రాక్షస పాలన అంతం అందించి టిడిపి ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా టిడిపి అలుపెరుగని పోరాటం చేస్తుందని, నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అవిశ్రాంత కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడి, టిడిపి పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమానికి హాజరవుతున్న టిడిపి కార్యకర్తలు నాయకులు అభిమానుల కోసం గుమగుమలాడే పసందైన బిర్యాని తయారు చేయించారు. అందరికీ ఫుడ్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్ అందించారు. నూజివీడు నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో తెలుగు తమ్ముళ్ల తో పాటు పార్టీ అభిమానులు కార్యకర్తలు ప్రజలు పాల్గొనడం విశేషం.

## పల్నాడు జిల్లాలో జగనన్న విద్యా దీవెన నాలుగో విడత తల్లుల బ్యాంకు ఖాతాలో జమ: పల్నాడు కలెక్టర్ శివ శంకర్ లోతేటి.



పల్నాడు జిల్లా. నరసరావుపేట. నవంబర్ 30 ( ప్రజా పాలన ప్రతినిధి) : పల్నాడు జిల్లాలో జగనన్న విద్యా దీవెన నాలుగో వ విడత త్రైమాసిక చెల్లింపులు ద్వారా 43, 558 మంది విద్యార్థులకు రూ.31.28 కోట్ల రూపాయల ను 39.149 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకం లో భాగంగా 43558 విద్యార్థులకు రూ.31కోట్ల 28 లక్షల 88వేల,106 రూపాయలను 39,149 తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నియోజక వర్గాల వారీగా విద్యార్థులకు ఈ త్రై మాసికం లో విద్యార్థులు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నమయ్య జిల్లా మదన పల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి జగనన్న విద్యా, వసతి దీవెన నగదు జమ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతక ముందు జిల్లా కలెక్టర్ కార్యమానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా మెరుగైన సమాజం తయారు చేసేందుకు విద్యార్థులను తీర్చి దిద్దుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చిలకలూరిపేట,గురజాల,మాచర్ల, నరసరావు పేట, పెదకూర పాడు, సత్తెనపల్లి, వినుకొండ నియోజక వర్గాల వారీగా ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన వివరాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటప్పయ్య, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్. టి వెల్ఫేర్, ఇ.బి.సి, కాపు, ముస్లిమ్, క్రిస్టియన్ సంక్షేమ శాఖల అధకారులు తదితరులు పాల్గొన్నారు.

## భర్త చనిపోయి తొమ్మిది నెలలు అయినా పెన్షన్ రాని వృద్ధురాలు



గోకవరం ప్రజా పాలన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఎగిపాటి ఆనందరావు చనిపోయి సుమారు 9 నెలలు కావస్తుంది ఆనందరావు భార్య సింహాచలం గత 9 నెలల నుంచి పెన్షన్ రావటం లేదు అని మాజీ జడ్పిటిసి పాలూరి బోసి బాబు తెలిపారు వాలంటరీలని సచివాలయ వారిని అడిగి కాళ్లు అరిగిపోయి మా దగ్గరికి రావడం జరిగింది సింహాచలం గారు కొత్త పెన్షన్ అడగట్లేదు వాళ్ళు ఆయన వచ్చిన పెన్షన్ మాత్రమే తనకు మంజూరు చేయాలని పదేపదే అధికారులు కోరుతున్నారు కానీ చనిపోయి తొమ్మిది నెలలు అయినా సరే ఇంకా పెన్షన్ ట్రాన్స్ఫర్ కావక పోవడానికి కారణం ఏమైనా ఉందా రేషన్ కార్డు మాత్రం మార్చేసారు అధికారులు ఎందుకంటే ఇద్దరు పేర్లు ఉంటే ఇద్దరికి రేషన్ ఇవ్వాలని ఒక పేరు ఉన్న కార్డు ఇవ్వడం జరిగింది దానిమీద ఉన్న శ్రద్ధ ఆ వృద్ధ మహిళకు పెన్షన్ ఇప్పించడంలో అధికారులకు ఏమాత్రం కూడా శ్రద్ధ లేకుండా పోయింది దీనిపై అధికారులు వెంటనే స్పందించకపోతే కలెక్టర్ వారికి మేమురాండం ఇవ్వడం జరుగుతుందని గోకవరం మండల తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు అన్నారు

## రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధి చేయాలి: మండల సమావేశంలో ఎమ్మెల్యే చంటిబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం ప్రజాపాలన ప్రతినిధిరాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి నాయకులందరూ కలసికట్టుగా పనిచేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు బుధవారం గోకవరం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని నాయకులందరూ రాజకీయ పార్టీలకతీతంగా ఒక తాటిపైకు వచ్చి కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని అప్పుడే గ్రామాలు ప్రగతి పథంలో పనిచేస్తాయని ఎమ్మెల్యే చంటిబాబు అన్నారు గోకవరం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో రైతులకు తమ ధాన్యం నిలువ చేసుకోవడానికి గోని సంచులు కొరత అధికంగా ఉందని కావున ప్రభుత్వం వెంటనే రైతులకు తగినన్ని గోని సంచులు సరఫరా చేయాలని పలువురి ఎంపీటీసీలు కోరారు ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాల్లో నాడు నేడు పనులు బయట వ్యక్తుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయని దీనివలన పనులు ఇష్టం వచ్చినట్లు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని వెదురుపాక సర్పంచ్ ఆరోపించారు రంప యర్రంపాలెం గ్రామంలో రైతు భరోసా కేంద్రం పూర్తయినప్పటికీ సచివాలయం పూర్తి కానందున తమకు బిల్లు రావడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి శ్రీరంగా రమేష్ ,వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు ఎంపిటిసిలు గ్రామ సర్పంచులు ఇంజనీరింగ్ అధికారి అబ్బాయి దొర ,ఎన్ ఆర్ జి ఎస్ ఏపీవో అప్పలరాజు .మండల శాఖ విద్యాశాఖ అధికారి బి .గౌరమ్మ, ఏవో రాజేశ్వరి .పశు వైద్య శాఖ అధికారి కృష్ణవేణి .ఎండిఓ కే .ఎస్.ఎన్ మూర్తి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

## ఆక్వా రైతులను కాపాడండి.. అమలాపురం కలెక్టరేట్ ను ముట్టడించిన జనసేన పార్టీ. నాయకులు




అమలాపురం నవంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి.:ఉభయగోదావరి జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆక్వా రైతు ఆక్రందన అనే కార్యక్రమాన్ని బుధవారం అమలాపురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ కార్యాలయాన్ని జనసేన పార్టీ నాయకులు మరియు వీర మహిళలు బుధవారం ఉదయం కలెక్టరేట్ ను ముట్టడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ నాయకులు, ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు కు అందజేశారు. ఈ సందర్భంలో జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ మన రాష్ట్రానికి ప్రధాన ఆదాయం రంగంలో ఒకటగా నిలిచిన ఆక్వా రంగం ఈరోజు కుదేలు అయిపొందని ఒకప్పుడు రొయ్యలు సాగు అంటే బంగారం పండించటమే అన్నట్లుగా విరజిల్లిన రొయ్యల సాగు గత మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం అనైతిక వైఖరి విధానాలు. కొనుగోలుదారులు మేత రేట్లు అవకాశాన్నంటడం, మందుల రేట్లు భగభగమనడం విద్యుత్ చార్జీలు సబ్సిడీ ఎత్తివేసి విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచడం లీజులు పెరిగిపోవడం, తూకం ద్వారా రైతుల ను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్జనసేన పార్టీ ఇంచార్జ్ పార్టీ ఇంచార్జ్ డిఎంఆర్ శేఖర్, అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, రాష్ట్ర పీఏసీ సభ్యులు పితాని బాలకృష్ణ, కొత్తపేట పార్టీ ఇంచార్జ్ బండారి శ్రీనివాసరావు, ఉభయగోదావరి జనసేన పార్టీ అధికార ప్రతినిధి కడలి ఈశ్వరి,ఉమ్మడి తూర్పు గోదావరి జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ సుంకర కృష్ణవేణిఅమలాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ళ నాగ సతీష్, అమలాపురం రూరల్ పార్టీ అధ్యక్షులు లింగోలు పండు, అయినవిల్లి జనసేన పార్టీ అధ్యక్షుడు గుర్రాల రాంబాబు, సిరిగినీడి వెంకటేశ్వరరావు, మరియు వీర మహిళలు , జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంటాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిడిపి యువ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రావు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి నవంబర్ 30:తెలుగుదేశం శాసనసభ్యులు, మాజీ మంత్రి వర్యులు గౌరవ శ్రీ గంటా శ్రీనివాసరావు కి వేములవలస ఉ వ సర్పంచ్ టిడిపి యువ నాయకుడు కోదాడ నవీన్ జ్ఞానేశ్వర్ రావ్ తరఫున జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ. మీరు సదా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని... ఇలాంటి మరెన్నో పుట్టిన రోజులను సంతోషంగా జరుపుకోవాలని... ప్రజల ఆశీస్సులతో నిండు నూరేళ్లు కీర్తి సంపదలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాను.పార్టీ ఏదైనా, నియోజకవర్గం ఎక్కడైనా ఆయన ఎంటర్ అయితే గెలిచి తీరుతారు. విశాఖపట్నం జిల్లా ) లో ఎక్కడి నుంచి పోటీ చేసినా గంటా గెలుపు గ్యారెంటీ. గత ఎన్నికల్లో కూడా భీమిలి నుంచి విశాఖ నార్త్ కు వచ్చి గెలిచారాయన. ఐతే టీడీపీ ఓటమి పాలవడంతో అధికారం లేకుండానే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు అటువంటి గొప్ప నాయకులు మా వంటి యువకులకు మార్గదర్శకులు మరొక్కసారి వేములవలస పంచాయతీ తరపున కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రావ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## బడ్జెట్ సమావేశం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు



బాపట్ల జిల్లా ప్రజాపాలన నవంబర్.30. : కర్లపాలెం మండల సర్వసభ్య, బడ్జెట్ సమావేశం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను చిన్నపిల్లల గా భావించి సమావేశం కి పిలిచి బడ్జెట్ సమావేశపు వివరణ కాపీలు మాకు ఇవ్వకుండా పాఠాలు చెప్పుకుంటూ పోతు చివరకు సంతకాలు పెట్టించుకుంటే సరిపోతుందా ? మమ్మల్ని ఎన్నుకున్న ప్రజలకు మేము సమాధానం చెప్పవలసిన అవసరం మాకు లేదా అంటూ అధికారులు నిర్లక్ష్య వైఖరి ఖండిస్తూ, అదేవిధంగా సర్వ సభ్య సమావేశానికి ఆహ్వానం పంపుతున్న రావలసిన అన్ని శాఖల అధికారులలో చాలా మంది అధికారులు రాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నా పట్టించుకోక పోవటాన్ని నిరసిస్తూ మరియు ప్రజాసేవ కోసం ఎంపీటీసీ లకు గెలిచి షుమారు సవత్సరంన్నర అవుతున్న ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వకపోవటాన్ని ఖండిస్తూ ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు మరియు తోటి ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు సర్వసభ్య సమావేశం ను బాయ్కాట్ చేశారు.

## వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల జిల్లా ప్రజాపాలన నవంబర్. 30.: బాపట్ల పట్టణం 11వ వార్డ్ వెంగల విహార్ నందు జరిగిన దళితరత్న డా. గుజ్జర్లపూడి చార్వాక గారి మనుమరాలు షైనీ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ లివేగేశన నరేంద్ర వర్మ.

## సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఆకుల శ్రీనివాసరావు షేక్ బాషా ఎన్నిక




విస్సన్నపేట, ప్రజాపాలన ప్రతినిధి : విస్సన్నపేట స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండల ఏడవ మహాసభ ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని ఈ దేశానికి శ్రమతో కూడి కష్టపడుతున్న కార్మికులను వదిలేసి బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే పనులు కేంద్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు .అనంతరం కార్యదర్శి నక్క తిరుపతమ్మ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టి జరిగిన ఉద్యమాలు పోరాటాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ కార్మికులు వ్యవసాయ కార్మికులు రైతులు కలిసి రానున్న కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాల సిద్ధపడాలన్నారు అనంతరం నూతన కమిటీని 17 మందితో ఏర్పాటు చేయడం జరిగింది అధ్యక్ష కార్యదర్శులుగా ఆకుల శ్రీనివాసరావు షేక్ బాషా సహాయ కార్యదర్శిగా నక్క తిరుపతమ్మ సహాయ కార్యదర్శిగా నిర్మల ఉపాధ్యక్షులుగా జమలయ్య కోశాధికారిగా రాము ప్రమీల ఎన్నికయ్యారు నూతన కమిటీ డిసెంబర్ 15 16 జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

## నన్ను నమ్మండి బ్రో..అడివి శేష్ కౌంటర్!




'కార్తికేయ 2' తనేవాత తెలుగు సినిమాలు ఆ స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం లేదు. మెగాస్టార్ నటించిన 'గాడ్ ఫాదర్' దీపావళి సందర్భంగా థియేటర్లలో సందడి చేసినా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావాన్ని చూపించలేకపోయింది. ఆ తరవాత సమంత నటించిన 'యశోద' అయినా బాక్సాఫీస్ వద్ద కొత్త కళని తీసుకొస్తుందని ఆశించారు. ఆ స్థాయిలో కాకపోయినా ఫరవాలేదనిపించింది. అయితే డబ్బింగ్ సినిమాల తరహాలో మన సినిమాలు 'కార్తికేయ 2' తరువాత సందడి చేయడం లేదు. ఈ నేపథ్యంలో అందరి దృష్ణ ఇప్పుడు డిసెంబర్ 2న విడుదలవుతున్న 'హిట్ 2'పై పడింది. క్షణం నుంచి 'మేజర్' వరకు వరుసగా ఐదు హిట్ లని తన ఖాతాలో వేసుకున్న అడివి శేష్ ఈ మూవీలో హీరోగా నటించాడు. 'హిట్' మూవీకి ఫ్రాంచైజీగా నేచురల్ స్టార్ నాని నిర్మించిన ఈ మూవీకి శైలేష్ కొలను దర్శకత్వం వహించాడు. 'ఖిలాడీ' ఫేమ్ మీనాక్షీ చౌదరి హీరోయిన్ గా నటించిన ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కోసం తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టీజర్ ట్రైలర్ లతో ఇప్పటికే భారీ బజ్ క్రియేట్ అయిన ఈ మూవీతో మళ్లీ టాలీవుడ్ లో సరికొత్త హంగామా మొదలు కానుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మూవీ మరో రెండు రోజుల్లో థియేటర్లలోకి రాబోతోంది. ఇదిలా వుంటే మర్డర్ మస్టరీ నేపథ్యంలో ఒళ్లు గగుర్పొడిచే విజువల్స్ తో ఓ సైకో కిల్లర్ కథగా రూపొందిన ఈ మూవీపై ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది. ఈ మూవీలో హీరోయిన్ గా నటించిన మీనాక్షిచౌదరినే సైకో కిల్లర్ అంటూ ఓ వార్తని నెటిజన్ నెట్టింట వైరల్ చేస్తున్నాడు. ఇది హీరో అడివి శేష్ కంటపడింది. వెంటనే దీనికి తనదైన స్టైల్లో అడివి శేష్ కౌంటర్ ఇచ్చాడు. ఇంతకీ నెటిజన్ ఏమని ప్రచారం చేస్తున్నాడంటే..గైస్ సినిమాలో హీరోయిన్ మీనాక్షీ చౌదరినే విలన్ అంటా. మా ఫ్రెండ్ ఒకరు సినిమాలో నటించిన పోలీస్ కానిస్టేబుల్స్ లో ఒకరుగా నటించాడు. నేను చెప్పిందే సత్యం.. నిజం హీరోయినే ఇందులో బ్లడీ సైకో' అంటూ కొంత మందిని నమ్మించే ప్రయత్నం చేయడం మొదలు పెట్టాడు.

## 'ఆదిపురుష్' కు దక్కనిది 'హను-మాన్' కు దక్కింది..!



క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం "హను-మాన్". తేజ సజ్జ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఇది హనుమంతుడి పాత్ర ఆధారంగా రూపొందించబడిన ఫిక్షనల్ సూపర్ హీరో మూవీ. ఇప్పటికే వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. ఇందులోని నాణ్యమైన వీఎఫ్ఎక్స్ మరియు గ్రాఫిక్స్ అందరినీ అబ్బురపరిచాయి. సినీ అభిమానులే కాకుండా పలువురు ప్రముఖులు సైతం "హను-మాన్" సినిమా టీజర్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. అలానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా టీమ్ ని ప్రశంసించారు. బీజేపీ నేత కిషన్ రెడ్డి రీసెంట్ గా 'హను మాన్' టీజర్ చూసి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా కలిసి అభినందించారు. టీజర్ చాలా బావుందని.. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఇటీవల కాలంలో కొన్ని రాజకీయ పార్టీలు నిర్దిష్టమైన కంటెంట్ తో తెరకెక్కే చిత్రాలకు సపోర్ట్ గా నిలుస్తున్నారు. 'కార్తికేయ 2' చిత్రానికి అధికార బీజేపీ పార్టీకి చెందిన నాయకులు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటడానికి ఎంతో కొంత సహాయపడిందనేది వాస్తవం.

## టిల్లు రూమర్స్ పై క్లారిటీ ఇస్తాడట!




ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 'డీజే టిల్లు' సైలెంట్గా విడుదలై సెన్సేషనల్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. అత్యంత తక్కువ బడ్జెట్ తో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రూ. 50 కోట్లని రాబట్టడంతో ఒక్కసారిగా సిద్ధూ జొన్నలగడ్డ కు భారీ క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమాకు దర్శకుడు విమల్ కృష్ణే అయినా క్రెడిట్ మొత్తం సిద్ధూ జొన్నలగడ్డకే దక్కింది. దీంతో సీక్వెల్ పై అంచనాలు పెరిగాయి. 'డీజే టిల్లు' హ్యూజ్ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దీనికి ప్రస్తుతం సీక్వెల్ గా 'టిల్లు స్క్వేర్'ని రూపొందిస్తున్నారు. ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లే సందర్భం నుంచే వరుస వివాదాలు చుట్టుముట్టడం మొదలైంది. ముందు ఈ ప్రాజెక్ట్ నుంచి దర్శకుడు విమల్ కృష్ణ తప్పుకున్నాడు. అదేంటంటే చేసిన సినిమానే మళ్లీ చేయడం తనకు ఇష్టం లేదని చెప్పుకొచ్చాడు. తన ప్లేస్ లో మల్లిక్ రామ్ వచ్చి చేరాడు. కట్ చేస్తే హీరోయిన్ నేహా శెట్టి ఔట్.. ఆ ప్లేస్ లో అనుపమ పరమేశ్వరన్ వచ్చేసింది. రెగ్యులర్ షూటింగ్ మొదలైంది అంటూ టీమ్ ఓ వీడియోని విడుదల చేసింది. ఆ వీడియోలో పూజా హెగ్డే తో పాటు అనుపమ పరమేశ్వరన్ పై కూడా సిద్ధూ జొన్నలగడ్డ పంచ్ వేశాడు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు కానీ ఈ మూవీ నుంచి అనుపమ పరమేశ్వరన్ కూడా తప్పుకుందని తెలిసింది. తను ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడానికి కారణం సెట్ లో హీరో సిద్ధూ జొన్నలగడ్డ వ్యవహరించిన తీరు అని అది నచ్చకే అనుపమ ఈ మూవీ నుంచి తప్పుకుందని వార్తలు వినిపిస్తున్నాయి. తన స్థానంలో నయా రాధికగా మడోన్నా సెబాస్టియన్ ని ఎంపిక చేసుకుంటున్నారట. అయితే ఈ వార్తలపై సిద్ధూ జొన్నలగడ్డ సోషల్ మీడియా వేదికగా స్పందిచాడు. టైటిల్ సాంగ్ షూట్ చేస్తున్న ఓ స్టిల్ ని అభిమానులతో పంచుకున్న సిద్ధూ ఫ్రెష్ అంట్ న్యూ రైడ్ ని మీకు అందిస్తానని ప్రామిస్ చేస్తున్నానన్నాడు. అంతే కాకుండా తనకు సపోర్ట్ చేస్తున్న అందరికి ధన్యవాదాలు తెలిపిన సిద్ధూ జొన్నలగడ్డ 'టిల్లు 2'ని 2023 మార్చి లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామన్నాడు. ఇక రూమర్స్ పై త్వరలోనే ఓ స్పెషల్ ఇంటరవ్యూతో సమాధానం చెబుతానన్నాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. రూమర్స్ పై సిద్ధూ ఎలా.. ఏమని క్లారిటీ ఇస్తాడో వేచి చూడాల్సిందే. అయితే హీరోయిన్ మరిదంట కదా అంటూ నెటిజన్లు అడిగిన ప్రశ్నకు మాత్రం సిద్ధూ రిప్లై ఇవ్వకపోవడం గమనార్హం.

## ఆర్ఆర్ఆర్ కి ఆస్కార్ కాకుండా మరోటి..!




టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్ ఆర్ ఆర్ సినిమా జాతీయ స్థాయిలో దక్కించుకున్న వసూళ్ల విషయం గురించి ఇప్పటి వరకు చర్చ జరిగింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దక్కుతున్న గౌరవం మరియు అవార్డుల గురించి చర్చ మొదలు అయ్యింది. ఆర్ ఆర్ ఆర్ సినిమా ఆస్కార్ నామినేషన్ ను దక్కించుకోవడం ఖాయం అంటూ అంతా నమ్మకంతో ఉన్నారు. ప్రైవేట్ గా ఆర్ ఆర్ ఆర్ సినిమా యూనిట్ సభ్యులు నామినేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆస్కార్ అవార్డు ఏమో కానీ పలు అంతర్జాతీయ స్థాయి అవార్డులు ఈ సినిమాకు దక్కుతున్నాయి. ఆస్కార్ ముందు ఇలా అంతర్జాతీయ స్థాయి అవార్డులు రావడం పట్ల చిత్ర యూనిట్ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఆస్కార్ అవార్డ్ కూడా దక్కడం ఖాయం అంటున్నారు. తాజాగా ఆర్ఆర్ఆర్ సినిమా సన్ సెట్ సర్కిల్ అవార్డును సొంతం చేసుకుంది. ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్డ్ ఫిల్మ్ కేటగిరీలో ఆర్ ఆర్ ఆర్ సినిమాకు గాను సన్ సెట్ సర్కిల్ అవార్డు దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో వీరు సినిమాలకు అవార్డులు ఇస్తున్నారు. ఆస్కార్ రేంజ్ కాకున్నా కూడా అంతర్జాతీయ స్థాయి అవార్డు అవ్వడంతో రామ్ చరణ్.. ఎన్టీఆర్ అభిమానులు మరోసారి హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ ఆర్ ఆర్ సినిమా కు కీరవాణి సంగీతాన్ని అందించాడు. రామ్ చరణ్ అల్లూరి పాత్రలో నటించగా ఎన్టీఆర్ కొమురం భీమ్ పాత్రలో నటించాడు. ఈ సినిమా లో ఆలియా భట్ హీరోయిన్ గా నటించగా అజయ్ దేవగన్ కీలక పాత్రలో కనిపించాడు. సినిమా ఓటీటీ ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకులను అలరించింది. కనుక అక్కడ పలు అవార్డులు దక్కుతున్నాయి.

## మహేష్ తో 'గ్లోబ్ ట్రాటింగ్ అడ్వంచరస్' అంటే ఇలా!



ఎస్ ఎస్ ఎంబీ 29వ చిత్రం పాన్ ఇండియా అని ఇప్పటికే కన్ఫమ్ అయింది. కానీ దేశం గర్వించదగ్గ దర్శకుడు రాజమౌళి అంతకు మించి ఈ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. జక్కన్న అమెరికా వెళ్లిన నాటి నుంచి తిరిగొచ్చే వరకూ మహేష్ సినిమా గురించి చర్చ సాగుతూనే ఉంది. హాలీవుడ్ దిగ్గజాలతో మహేష్ సినిమా గురించి డిస్కషన్స్ చేసినట్లు తెలుస్తోంది. విజువల్ ట్రీట్' బాహుబలి' సినిమాతో జక్కన్న తనలో ఓ రకమైన భావాన్ని బయటపెట్టగిలిగారు. అటుపై 'ఆర్ ఆర్' సినిమాతో మరో రకమైన ఆలోచనా విధానాన్ని వెండి తెరపై ఆవిష్కరించి షెభాష్ అనిపించుకున్నారు. ఇంకా ఆయన మనసులో సాధించాల్సింది చాలా ఉందని బలమైన కోర్కెలున్నాయి. అందులో ఒకటి మహేష్ ని హాలీవుడ్ రేంజ్ లో ఎలివేట్ చేయడం. అందుకే ఈ సినిమా గురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రారంభానికి ముందే ప్రమోట్ చేస్తున్నారు. సాహసోపేతమైన కథలో మహేష్ కనిపిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి? అంటూ అంచనాలు అంతకంతకు పెంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియానా జోన్స్ సిరీస్ లాంటి సినిమాచేయాలని ఉందని....మహేష్ తో అలాంటి సినిమానే చేస్తున్నట్లు రివీల్ చేసారు. అందుకే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచరస్ గా ఈ సినిమా తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. మరి ఈ గ్లోబ్ అడ్వంచరస్ అంటే? ఏంటో ఓసారి చూద్దాం. గ్లోబ్ ట్రాటింగ్ అనే పదానికి అర్థం 'వెతకటం దగ్గర నుంచి' చాలా దూరమైన ప్రయాణం అనే అర్థాలు ఉన్నాయి.

## చంద్రముఖి 2 కోసం బాలీవుడ్ క్వీన్?



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా 2005 లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హారర్ మూవీ చంద్రముఖి ఏ స్థాయిలో సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో మళ్లీ అదే కథకు సీక్వెల్ తీసుకురావాలి అని దర్శకుడు పీ. వాసు పదేళ్ల క్రితమే ప్రయత్నాలు చేశాడు. కానీ సరైన కథ సెట్ అవ్వకపోవడంతో దాదాపు అందరూ కూడా విషయాన్ని మర్చిపోయారు. ఇక మళ్ళీ ఇన్నాళ్లకు దర్శకుడు సీక్వెల్ కథను తెరపైకి తీసుకు వస్తున్నాడు. అయితే ఈసారి సూపర్ స్టార్ రజినీకాంత్ కాకుండా డాన్స్ కొరియోగ్రాఫర్ నుంచి స్టార్ హీరోగా ఎదిగిన రాఘవ లారెన్స్ హీరోగా నటించబోతున్నాడు. చంద్రముఖి 2 షూటింగ్ మొదలుపెట్టి చాలా కాలం అయినప్పటికీ కూడా మధ్యలో కొన్ని బ్రేకులు పడడంతో వాయిదా పడుతూ వస్తోంది. ఇక ఇటీవల హైదరాబాదులో మళ్ళీ ఈ సినిమాకు సంబంధించిన మరొక కొత్త షెడ్యూల్లో మొదలుపెట్టారు. ఇక కీలక సన్నివేశాలు ముగిసిన అనంతరం మరో రెండు షెడ్యూల్ స్ఫూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న మరొక టాక్ ప్రకారం ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ క్వీన్ కంగనా రనౌత్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. దర్శకుడు ఇదివరకే ఆమెకు కథ గురించి చెప్పడంతో పాజిటివ్ గా స్పందించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో ఆమె తన నిర్ణయాన్ని ఇంకా చెప్పలేదని తెలుస్తోంది. త్వరలోనే అధికారికంగా క్లారిటీ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బాలీవుడ్ హీరోయిన్స్ అత్యధిక పారితోషికం అందుకుంటున్న వారిలో కంగనా ఒకరు. అయితే ఆమె నటించిన గత నాలుగు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచాయి. ఇక ఇప్పుడు చంద్రముఖి సీక్వెల్లో నటిస్తే సౌత్ లో కొంత క్రేజ్ వచ్చే అవకాశం ఉంటుంది. మరి ఈ సినిమా చేయడానికి ఆమె ఒప్పుకుంటుందో లేదో చూడాలి.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com